

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ | బుధవారం 11-8-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 8 | పేజీలు:4 | వెల: రూ.1/-


## హైదరాబాద్‌ను ఫిల్మ్ హబ్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యం : మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్




హైదరాబాద్ , ఆగష్టు 10:హైదరాబాద్‌ను ఫిల్మ్ హబ్‌గా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సినిమాటోగ్రఫి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. నగరంలోని బీఆర్‌కేఆర్ భవన్‌లో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి తలసాని అధ్యక్షతన మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సినిమా షూటింగ్‌ల కోసం పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇస్తున్నట్లు చెప్పారు. లాక్ డౌన్ సమయంలో థియేటర్‌లు మూసివేసి ఉన్న కారణంగా విద్యుత్ చార్జీలు, ప్రాపర్టీ ట్యాక్స్ మినహాయింపు తదితర విజ్ఞప్తులను ప్రభుత్వానికి అందజేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వచ్చే సమావేశంలో తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. 5వ ఆట ప్రదర్శనకు కూడా అనుమతించడం జరిగిందన్నారు.

## కుల గణన చేపట్టండి: లోక్‌సభలో డిమాండ్

న్యూఢిల్లీ, ఆగష్టు 10: కులం ప్రాతిపదికన జనాభాను లెక్కించాలని ఇవాళ పలు పార్టీలు లోక్‌సభలో డిమాండ్ చేశాయి. ఓబీసీ బిల్లుపై చర్చ సందర్భంగా పలువురు ఎంపీలు ఈ అంశాన్ని ప్రస్తావించారు. కుల గణన చేయకుంటే.. యూపీలో బీజేపీకి ఓటమి ఖాయమని ఎస్పీ ఎంపీ అఖిలేశ్ యాదవ్ అన్నారు. బిల్లు సందర్భంగా సమాజ్‌వాదీ పార్టీ నేత మాట్లాడుతూ.. ఓబీసీ బిల్లుకు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. రిజర్వేషన్ కోటాపై ఉన్న 50 శాతం సీలింగ్‌ను తొలగించకుండా.. ఎలా ఓబీసీ బిల్లును పాస్ చేస్తారని ఆయన ప్రశ్నించారు. అత్యధిక సంఖ్యలో ఎంపీలను కూర్చోబెట్టేందుకు సెంట్రల్ విస్టాను కడుతున్నారని, కానీ ఓబీసీలు.. దళితులు, మైనార్టీలను ఎందుకు 50 శాతం కోటాకే కట్టిపడేస్తున్నారని అఖిలేశ్ అడిగారు. ఓ ఓబీసీని సీఎం చేస్తారని హామీ ఇచ్చి.. యూపీలో క్షత్రియుడిని సీఎం చేశారని విమర్శించారు. కుల గణనను చేపట్టి, ఆ వివరాలను బహిర్గతం చేయాలని అఖిలేశ్ డిమాండ్ చేశారు.

కులం ప్రాతిపదికన జనాభా లెక్కించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ ఎంపీ బీ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఓబీసీ బిల్లుకు మద్దతు ఇచ్చిన ఆయన.. అఖిల భారత వైద్య విద్యలో ఓబీసీ కోటా లేదని గుర్తు చేశారు. నాలుగేళ్ల తర్వాత ప్రభుత్వం మళ్లీ ఆ కోటాను తెచ్చిందని, దానికి కృతజ్ఞత చెబుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఇదే సమయంలో కుల గణన కూడా చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## వేములవాడలో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు : మంత్రి కేటీఆర్



హైదరాబాద్ , ఆగష్టు 10:రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ నియోజకవర్గంలో రూ. 20కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. మంగళవారం మంత్రి కేటీఆర్‌ను వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు

. నియోజకవర్గంలో చేపట్టే పనుల వివరాలను మంత్రికి అందించారు.

అనంతరం మంత్రి కేటీఆర్ వేములవాడ అభివృద్ధిపై సమీక్షించి, అభివృద్ధికి పరిపాలన అనుమతులు జారీ చేశారు. రూ. 20కోట్ల విలువైన పనులు ప్రారంభించేందుకు అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యే రమేశ్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

## మాజీ కేంద్రమంత్రి పుంజాల శివ శంకర్ జన్మదిన వేడుకలు

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 10:(నేటినిజం ప్రతినిధి): మాజీ కేంద్రమంత్రి,గవర్నర్ స్వర్గీయ పుంజాల శివశంకర్ జన్మదిన వేడుకలు హైద్రాబాద్ హఫీజ్పేట్ లో మున్నూరు కాపు సంఘం శేర్లింగంపల్లి నియోజకవర్గం కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు పటేల్,జూబ్లీహిల్స్ నియోజకవర్గం కోఆర్డినేటర్ వాసాల రాజు , హఫీజ్పేట్ మున్నూరు కాపు సంఘం చైర్మన్ రమేష్ పటేల్ , కోశాధికారి మంగళరపు ఐలయ్య పటేల్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు . ఈ కార్యక్రమంలో శ్రీ రాజరాజేశ్వరి మున్నూరు కాపు నిత్యాన్నదానం ట్రస్ట్ చైర్మన్ కొండ దేవయ్య పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం కొండ దేవయ్య మాట్లాడుతూ భారత సామాజిక న్యాయ శిఖరంగా బీసీ కులాల సంక్షేమం కోసం అట్టడుగు బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం మున్నూరు కాపు ల అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. పుంజాల శివశంకర్ చూపించిన బాటలో మన మున్నూరుకాపు కుల సోదరులందరూ ఏకమై కుల అభివృద్ధి కోసం పాటుపడాలని కొనియాడారు అలాగే అట్టడుగు బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసినటువంటి పుంజాల శివశంకర్ , మాజీ శాసనసభ్యులు బొమ్మ వెంకన్న విగ్రహాలను ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామని అన్నారు . ఈ కార్యక్రమం అనంతరం మొక్కలు నాటారు. జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రేహౌండ్ పోలీస్ ఆఫీసర్ అల్లం కిషన్ పటేల్, వాయిస్ స్టూడియో ఎండి లక్ష్మణ్ పటేల్ పటేల్, ,గాజుల మహేందర్ పటేల్, మూర్తి శ్రీనివాస్ పటేల్, కొనవెని రమేష్ పటేల్, తాడేనీ మహేందర్ పటేల్ ,పోగుల సతీష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు .

## వీరశైవ లింగాయత్‌లను ఓబీసీలో చేర్చండి: బీబీ పాటిల్

న్యూఢిల్లీ, ఆగష్టు 10:లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఓబీసీ బిల్లుకు టీఆర్ఎస్ మద్దతు తెలిపింది. ఆ బిల్లుపై టీఆర్ఎస్ ఎంపీ భీమ్ రావ్ బస్వంతరావ్ పాటిల్ మాట్లాడారు. తెలంగాణలో అనేక జాతులు ఓబీసీలో కలవలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని 40 కులాలతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ అనేక కులాలు ఓబీసీ జాబితాలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయన్నారు. వీరశైవ లింగాయత్‌లు ఓబీసీలో చేరాలని ఎప్పటి నుంచి డిమాండ్ చేస్తున్నట్లు బీబీ పాటిల్ తెలిపారు. పదేళ్ల నుంచి వీరశైవ లింగా యత్‌ల అభ్యర్థన కేంద్రం వద్దే ఉందన్నారు. ఓబీసీ జనగణన చేపట్టాలన్నారు. ఓబీసీల మేలు కోసం ప్రత్యేకంగా మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని బీబీ పాటిల్ కోరారు. ఓబీసీల కోటా పెంచాలన్న బిల్లును స్వాగతిస్తున్నాం.. సమర్థిస్తున్నామని ఆయన తెలిపారు.

## తెలంగాణలో నాలుగు రకాల విప్లవాలు ప్రారంభం : మంత్రి కేటీఆర్



హైదరాబాద్ , ఆగష్టు 10:తెలంగాణలో నాలుగు రకాల విప్లవాలు ప్రారంభమయ్యాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో రెండో హరిత విప్లవం, మత్స్య పరిశ్రమలో నీలి విప్లవం, గొర్రెల పెంపకంతో పింక్ విప్లవం, పాడి పరిశ్రమలో శ్వేత విప్లవం మొదలైనట్లు వెల్లడించారు. తెలంగాణ వ్యవసాయరంగంలో సంక్షోభం నుండి సంవృద్ధి వైపు సాధించిన విజయంలో వ్యవసాయశాఖ పనితీరు అభినందనీయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ కొనియాడారు.

### వ్యవసాయానికి రాష్ట్ర శక్తిని మార్చే సత్తా..

వ్యవసాయరంగంపై మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ నగరంలోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో మంగళవారం సమావేశమై వ్యవసాయరంగంపై చర్చించింది. సమావేశంలో పాల్గొన్న మంత్రి కేటీఆర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇల్లంతకుంట ప్రాంతం ఒకప్పుడు దుర్భిక్షానికి చిరునామా ఉండే. నేడు అక్కడ లక్ష టన్నుల దిగుబడి సాధ్యమైంది. రాష్ట్రం శక్తిని మార్చే సత్తా వ్యవసాయరంగానికి ఉందన్నారు. రెండు కోట్ల పైచిలుకు జనాభా ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యవసాయరంగం నుండి ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు.

### డెమానిస్ట్రేట్ ఫార్మ్‌ల ఏర్పాటుకు యోచన..

రైతు అంటే చిన్నచూపు పోయిందన్న మంత్రి వ్యవసాయరంగాన్ని లాభసాటి రంగంగా మార్చాలని తెలిపారు. వ్యవసాయం పరిశ్రమగా మార్చేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను బలోపేతం చేయాలన్నారు. ఇందుకోసం ప్రొఫెసర్ స్వామినాథన్, జయతీ ఘోష్, పాలగుమ్మి సాయినాథ్, సుభాష్ పాలేకర్ ను మంత్రి వర్గ ఉపసంఘం సంప్రదించాలన్నారు. అమెరికాలోని అయోవాలో ఉన్న అగ్రికల్చర్ మ్యూజియంను అధికారుల బృందం సందర్శించాలన్నారు. 32 జిల్లాలలో 50 నుండి 100 ఎకరాలలో డెమానిస్ట్రేట్ ఫార్మ్ లు ఏర్పాటుకు యోచిద్దామన్నారు.

### వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల పరిశ్రమలను ప్రోత్సహించాలి..

వేరుశనగ, టమాటా వంటి వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల పరిశ్రమలను ప్రోత్సహించాలని మంత్రి కేటీఆర్ అన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం కేంద్రంగా నవీన ఆవిష్కరణలు రావాలన్నారు. చదువురాని వారు కూడా స్మార్ట్ ఫోన్ల రాకతో ఎంతో అవగాహన పెంచుకున్నారు. వ్యవసాయ రంగంలో సాంకేతికత వినియోగం పెరగాలన్నారు. రైతులకు ఫ్యాబ్లెట్‌లు అందించే అవకాశాలను పరిశీలించాలన్నారు. డ్రోన్లు, ఇతర వ్యవసాయ ఆవిష్కరణల వైపు యువతను ప్రోత్సహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో అందుబాటులో ఉన్న వ్యవసాయ యంత్రాల వివరాలను ఉబరైజేషన్ ప్రక్రియ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. మూడు శాతం జనాభా ఆధారపడ్డ అమెరికా వ్యవసాయ రంగం నుండి ఆ దేశ జీడీపీలో తొమ్మిది శాతం సంపద సమకూరుతుందన్నారు.

## పేదింటి చెస్ క్రీడాకారులకు ఎమ్మెల్సీ కవిత ఆర్థిక సాయం



హైదరాబాద్ , ఆగష్టు 10:ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోమారు తన ఉదారతను చాటుకున్నారు. నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ చెస్ పోటీలకు నిజామాబాద్ జిల్లాలోని ఇద్దరు నిరుపేద బాలికలు ఎంపికయ్యారు. వారికి ఆర్థిక సహాయం అందించి కవిత గొప్ప మనసును చాటుకున్నారు. జిల్లాకు చెందిన నర్సింగరావుకు ఇద్దరు కుమార్తెలు హర్షిత, రిషితలు చెస్ క్రీడాకారిణిలు. నిజామాబాద్ లో ప్రాథమిక విద్యాభ్యాసం చేస్తున్న వీరిద్దరూ అనేక చెస్ పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు.

త్వరలో నేపాల్‌లో జరిగే ఇండో- నేపాల్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు రిషిత, హర్షిత ఎంపికయ్యారు. ఖాట్మాండ్ లో ఈ నెల 14,15 న చెస్ పోటీలు జరగనున్నాయి. అయితే నర్సింగరావు కుటుంబ ఆర్థిక పరిస్థితిని పలువురు, ఎమ్మెల్సీ కవిత దృష్టికి తీసుకొచ్చారు. సోమవారం నిజామాబాద్ లో పర్యటించిన ఎమ్మెల్సీ హర్షిత, రిషితలను అభినందించారు.

అంతేకాదు టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు కావాల్సిన ఆర్థిక సాయాన్ని అందజేశారు. వారికి అన్ని రకాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆర్థిక సాయం అందించి భరోసా ఇచ్చిన ఎమ్మెల్సీ కవితకు నర్సింగరావు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## దళితబంధును దేశవ్యాప్తంగా అమలు చేయండి: ఎంపీ నామా

న్యూఢిల్లీ, ఆగష్టు 10:127వ రాజ్యాంగ సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టడం సంతోషకర విషయమని తెలంగాణ రాష్ట్ర సమితి ఎంపీ నామా నాగేశ్వర రావు అన్నారు. ఇవాళ ఆయన లోక్‌సభలో మాట్లాడారు. ఈ సవరణ బిలుతో రాష్ట్రాలకు అధికారం దక్కుతు ందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు ఓబీసీలను ఐడెంటిపై చేసే వీలవుతుందన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్.. ఓబీసీల కోసం ఎన్నో పథకాలు చేపట్టారన్నారు. రైతుల కోసం రైతు బంధు తీసుకువచ్చామని, ప్రతి ఏడాది ఒక ఎకరాకు పది వేలు ఇస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నదని ఎంపీ నామా తెలిపారు.

అయితే తాజాగా తెలంగాణ సర్కార్ దళితుల కోసం దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ఎంపీ నామా చెప్పారు. ప్రతి ఒక్కరూ సభలో.. ఓబీసీలు, దళితు ల కోసం మాట్లాడుతున్నారని, ఆ స్కీమ్ ప్రకారం దళిత ఫ్యామిలీలకు పది లక్షలు ఇస్తున్నామని తెలిపారు. దళిత బంధును దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఈ సందర్భంగా ఎంపీ నామా కేంద్రాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే ఆ పథకం స్టార్ట్ అయ్యిందన్నారు. ఓబీసీ బిల్లుకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ఎంపీ నామా చెప్పారు. లోక్‌సభలో రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టిన మంత్రి వీరేంద్రను నామా మెచ్చుకున్నారు. ఆయన వల్లే ఇవాళ సభ సాగుతోందన్నారు.

## గుజరాత్‌లోని అంకలేశ్వర్‌లో కోవాగ్జిన్ ఉత్పత్తికి గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ, ఆగష్టు 10:హైదరాబాద్‌లోని భారత్ బయోటెక్ సంస్థ కోవాగ్జిన్ ( అనీలజీలీతిని ) టీకాలను ఉత్పత్తి చేస్తున్న విషయం తెలిసిందే. ఆ కోవిడ్ టీకాల ఉత్పత్తి సంఖ్యను పెంచేందుకు మరిన్ని ఉత్పత్తి కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. ఈ నేపథ్యంలో గుజరాత్‌లోని అంకలేశ్వర్‌లో కోవాగ్జిన్ ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపినట్లు ఇవాళ కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్సూక్ మాండవీయ తెలిపారు. ఇండియాకు చెందిన భారత్ బయోటెక్ సంస్థ.. కోవిడ్ కోసం స్వదేశీయంగా కోవాగ్జిన్ టీకాను అభివృద్ధి పరిచింది. గతంలో కేవలం హైదరాబాద్ యూనిట్ నుంచి మాత్రమే కోవాగ్జిన్ ఉత్పత్తి జరిగేది. ఇక నుంచి అంకలేశ్వర్ యూనిట్ నుంచి కూడా ఉత్పత్తి ప్రారంభించనున్నది. జనవరి నుంచి ఆగస్టు వరకు 7 కోట్ల టీకా డోసులను భారత్‌బయోటెక్ ఉత్పత్తి చేసిన విషయం తెలిసిందే. కోవిడ్ లక్షణాలు ఉన్నవారిపై కోవాగ్జిన్ టీకా సామర్థ్యం 77.8 శాతంగా ఉంది. ఇక ఆ టీకాతో డెల్టా వేరియంట్‌పై 65.62 శాతం రక్షణ ఉన్నట్లు తెలుస్తోంది.

## రాజకీయ పార్టీలకు సుప్రీంకోర్టు షాక్

హైదరాబాద్ , ఆగష్టు 10:రాజకీయాల్లో నేరస్తులు పెరిగిపోవడం పట్ల సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. దాదాపు సగం మంది ఎంపీలపై క్రిమినల్ కేసులున్నాయని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే అన్ని రాజకీయపార్టీలూ.. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించిన 48 గంటల్లోగా వారి నేర చరిత్రను వెల్లడించాల్సిందేనని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ ఆర్ఎఫ్ నారీమన్, జస్టిస్ బీఆర్ గవాయ్‌లతో కూడి ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. గతేడాది ఫిబ్రవరి 13న ఇచ్చిన తీర్పులో మార్పులు చేసినట్టు పేర్కొంది. అభ్యర్థిత్వం ఖరారైన 48 గంటల్లోపు లేదా నామినేషన్ వేయడానికి 2 వారాల ముందు అభ్యర్థుల నేర చరిత్రను వెల్లడించాలని గతంలో బీహార్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు పేర్కొంది. కాగా గత నాలుగు సార్వత్రిక ఎన్నికల్లో నేర చరిత్ర ఉన్న అభ్యర్థులు ఎక్కువైపోయారని జస్టిస్ నారీమన్ చెప్పారు. 2004లో 24 శాతం మంది అభ్యర్థులపై నేరచరిత్ర ఉండగా.. 2009లో 30 శాతం, 2014లో 34%, 2019 ఎన్నికల్లో 43 శాతం మంది ఎంపీలపై క్రిమినల్ కేసులున్నాయని ఆయన గుర్తు చేశారు. ఆ కేసులన్నీ పెండింగ్ లోనే ఉన్నాయన్నారు.

## 'ప్రధాన మంత్రి ఆత్మనిర్భర్ స్వస్త్ భారత్ యోజన'

న్యూఢిల్లీ, ఆగష్టు 10:'ప్రధాన మంత్రి ఆత్మనిర్భర్ స్వస్త్ భారత్ యోజన' (పీఎంఏఎస్‌బీవై) పథకం ఫిబ్రవరి 1వ తేదీ 2021 న ప్రకటించబడింది. 2021-2022 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రసంగంలో.. ఈ పథకాన్ని ప్రకటించారు. గడిచిన ఆరు సంవత్సరాలలో సుమారు రూ. 64,180 కోట్ల అవుట్‌లేతో దీనిని అమలుచేయడం జరిగింది. ఇది జాతీయ ఆరోగ్య మిషన్ తోడ్పాటుకు అదనం. ఈ పథకం కింద లక్ష్యంగా పెట్టుకున్న అంశాలు 2025-26 ఆర్థిక సంవత్సరం ద్వారా సాధించబడతాయి. అవి ఈ క్రింది విధంగా ఉన్నాయి:10 అత్యధిక ప్రాధన్యత కలిగిన రాష్ట్రాలలో 17,788 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు మరియు ఆరోగ్య కేంద్రాలకు మద్దతివ్వడం. అన్ని రాష్ట్రాలలో 11,024 పట్టణ ఆరోగ్య మరియు ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడం. అన్ని జిల్లాలలో సమీకృత ప్రజా వైద్య ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం మరియు 11 హై ఫోకస్ రాష్ట్రాల్లో 3382 బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌లను ఏర్పాటు చేయడం;

602 జిల్లాలలో క్రిటికల్ కేర్ హాస్పిటల్ బ్లాక్‌ల ఏర్పాటు మరియు 12 కేంద్ర సంస్థలను ఏర్పాటు చేయడం;

నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ), దాని 5 ప్రాంతీయ శాఖలు మరియు 20 మెట్రోపాలిటన్ హెల్త్ నిఘా విభాగాలను బలోపేతం చేయడం;

అన్ని పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లను కనెక్ట్ చేయడానికి అన్ని రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలకు ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ పోర్టల్ విస్తరణ;17 కొత్త పబ్లిక్ హెల్త్ యూనిట్ల నిర్వహణతో పాటు 32 విమానాశ్రయాలు, 11 ఓడరేవులు మరియు 7 ల్యాండ్ క్రాసింగ్‌లలో ఇప్పటికే ఉన్న దాదాపు 33 పబ్లిక్ హెల్త్ యూనిట్‌లను బలోపేతం చేయడం.;15 ఆరోగ్య అత్యవసర ఆపరేషన్ కేంద్రాలు మరియు 2 సంచార వైద్యశాలల ఏర్పాటు ;డబ్ల్యుహెచ్ఓ నైరుతి ఆసియా రీజియన్ కోసం ఒక జాతీయ సంస్థ ఏర్పాటు, 9 బయో-సేఫ్టీ లెవల్ ఎఎ లాబొరేటరీలు మరియు 4 రీజినల్ నేషనల్ ఇనిస్టిట్యూట్స్ ఫర్ వైరాలజీ ఏర్పాటు చేయడం.

### చరిత్రలో నేటినిజం





శ్రీ 'దువ్వూరు' వంశమునందున
రత్నాల వలె వెలిగినట్టి రసికుల నేతనునే
'దివ్వెగ' గాంచెద - ఆరా
జువ్వర ప్రఖ్యాతి గాంచిన 'సుబ్బారావు'నే !!

( ఆగష్టు 11 రిజర్వు బ్యాంకు గవర్నరు దువ్వూరు సుబ్బారావు జయంతి...)

-రాధశ్రీ

సెల్: 9494481210





భువన విజయం తెలుగు సాహిత్య వేదిక, తెలంగాణ.

ఆహ్వానము

"మట్టి ఉప్పెన" పుస్తకావిష్కరణ సభ

తేది : 20-08-2021 సమయం : సాయంత్రం 06-00 గం॥ల నుండి...

వేదిక : జూమ్ యాప్

ఆహ్వానము : శ్రీమతి వనం తేజశ్రీ, ప్రముఖ కవయిత్రి.
సభాధ్యక్షులు : శ్రీ వేంకట రాణాప్రతాప్, భువన విజయం, రాష్ట్ర అధ్యక్షులు.
పుస్తక ఆవిష్కర్త : శ్రీ యాకూబ్, ప్రముఖ కవి, విమర్శకులు.
పుస్తక సమీక్ష : శ్రీ యనగందుల దేవయ్య, ప్రముఖ కవి, రచయిత.
గౌరవ అతిథులు : శ్రీ పంకాలయపాటి చంద్రశేఖర్, భువన విజయం వ్యవస్థాపక అధ్యక్షులు.
శ్రీ జీవన్, ప్రముఖ కవి, రచయిత.
శ్రీ దేవేంద్ర, ప్రముఖ కవి, రచయిత.
డా. సీతారాం, ప్రముఖ కవి, విమర్శకులు.
శ్రీ అరణ్యకృష్ణ, ప్రముఖ కవి.
శ్రీ మువ్వా శ్రీనివాసరావు, ప్రముఖ కవి.
శ్రీ కె. ఆనందాచారి, ప్రముఖ కవి, రచయిత.
డా. విరించి విరివింటి, ప్రముఖ కవి.

విశిష్ట అతిథులు :
శ్రీ కట్టా శ్రీనివాస్, ప్రముఖ కవి, పరిశోధకులు.
శ్రీ రాతు రవి, ప్రముఖ కవి.
శ్రీ మేడగాని శేషగిరి, ప్రముఖ వాగ్గేయకారులు.
డా. సిహెచ్. ఆంజనేయులు, ప్రముఖ కవి.
శ్రీ యశస్వి సతీష్, ప్రముఖ కవి.
శ్రీ పోతగాని మురళి, ప్రముఖ కవి.
శ్రీ పోతగాని మాధవరావు, ప్రముఖ కవి.
శ్రీమతి పురిమళ్ల సునంద, ప్రముఖ కవయిత్రి.
శ్రీమతి సమ్మెట ఉమాదేవి, ప్రముఖ రచయిత్రి.
శ్రీ నాగిళ్ళ రమేష్, ప్రముఖ కవి.
శ్రీ పగిడిపల్లి వెంకటేశ్వర్లు, ప్రముఖ కవి.
శ్రీ మెట్టా నాగేశ్వరరావు, ప్రముఖ కవి.
శ్రీ ఇబ్రహీం నిర్గుణ్, ప్రముఖ కవి.

ఆత్మీయ అతిథులు :
శ్రీ అమ్మంగి రత్నమహర్షి (బాబు), ప్రముఖ కవి.
శ్రీమతి తాళ్ళూరి రాధ, ప్రముఖ కవయిత్రి.
శ్రీమతి ఫణిమాధవి, ప్రముఖ కవయిత్రి.
శ్రీమతి రూప రుక్మిణి, ప్రముఖ కవయిత్రి.
శ్రీమతి మువ్వా జయశ్రీ, ప్రముఖ కవయిత్రి.
శ్రీమతి జాపుడి జిగీష, ప్రముఖ కవయిత్రి.
శ్రీ సీత్లానాయక్, ప్రముఖ కవి.
శ్రీ ఆవుల వీరభద్రం, ప్రముఖ వాగ్గేయకారులు.
శ్రీ రాచమళ్ళ ఉపేందర్, ప్రముఖ కవి, రచయిత.
శ్రీ యెలిశాల నాగమోహన్, ప్రముఖ కవి.
శ్రీ బి. సత్యనారాయణ, ప్రముఖ కవి.
శ్రీ నామా పురుషోత్తం, ప్రముఖ కవి.
శ్రీ దాసరోజు శ్రీనివాస్, ప్రముఖ కవి.
శ్రీమతి జ్వాలా స్రవంతి, ప్రముఖ కవయిత్రి.
శ్రీ అమర్ గ్యారా, ప్రముఖ కవి.

కవి స్పందన :
శ్రీ పోతగాని సత్యనారాయణ, ప్రముఖ కవి, రచయిత.

వందన సమర్పణ :
శ్రీ రాము కోలా, ప్రముఖ కవి.

# పిల్లల సాధారణ వ్యాక్సినేషన్‌కు కరోనా ఆటంకం

(తాజా 'ది లాన్సెట్' పరిశోధనా గ్రంథ వ్యాసం ఆధారంగా)

ప్రపంచ దేశాల సమగ్రాభివృద్ధిని ప్రభావితం చేయడంలో ప్రజారోగ్యం, విద్య ప్రధాన భూమికను నిర్వహిస్తాయని మనకు తెలుసు. నేటి బాలలే రేపటి ప్రపంచ కుగ్రామ పౌరులు. ప్రతి శిశు వు జనన క్షణం నుంచి పెరిగే క్రమంలో వివిధ వ్యాధుల నుంచి జీవితకాలం తట్టుకోవడానికి, రోగ నిరోధకశక్తిని కల్పించడానికి పలు టీకాలు ఉపయోగపడుతున్నాయి. బాలలకు అందించే టీకా జాబితాలో బిసిజి (బాసిల్లస్ కాల్మెట్ గురిన్), హెప్-బి1 (హెపటైటిస్-బి), ఓపివి-0 (ఓరల్ పోలియో వ్యాక్సీన్), డిటిపి-3 (డిఫ్తీరియా, టెటనస్, పెర్‌ట్యూసిస్), పిసివి-1 (న్యూమోనికొక కాంజుగేట్ వ్యాక్సీన్), హిబ్-2 (హిమోఫిలస్ ఇన్ఫ్లుయెంజా టైప్-1), యంసివి-1 (మీసిల్స్ కంటేనింగ్ వ్యాక్సీన్ ఫస్ట్ డోస్), యంయంఆర్-2 (మీసిల్స్, మంప్స్, రుబెల్లా) లాంటి పలు ముఖ్యమైన టీకా మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా కరోనా మహమ్మారి సృష్టించిన కల్లోలంతో వివిధ వయసుల్లో పిల్లలకు, గర్భిణి మహిళలకు అందించే టీకా ఔషధాల పంపిణి కార్యక్రమానికి తీవ్ర విఘాతం ఏర్పడి, పిల్లల ఆరోగ్య భవిష్యత్తు పెను ప్రమాదంగా మారిందని 07 ఆగష్టు 2021 సంచికలో 'ది లాన్సెట్' ప్రచురించిన పరిశోధనా వ్యాసం తెలియజేస్తున్నది. శాస్త్రవేత్త 'కేట్ ఖాసీ' పరిశోధనా బృందం చేసిన పరిశోధనలు పిల్లలకు ఇవ్వాల్సిన సాధారణ టీకాల కార్యక్రమం 2020లో కరోనా వల్ల ఎంత వరకు జరిగిందనే కఠిన వాస్తవాలను సాధికారికంగా తెలియజేసింది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా పిల్లలకు టీకాలు సకాలంలో అందేలా ప్రభుత్వ యంత్రాంగం, పౌర సమాజం ప్రయత్నించడం మరువరాదని, రాబోయే రోజుల్లో కరోనా అలల తాకిడికి టీకా ఉద్యమం సకాలంలో అందకుండా మందగమనం జరిగితే శిశు మరణాలు పెరగవచ్చని తెలుపుతున్నది.

**ప్రపంచ స్థాయిలో?.**

కోవిడ్-19 విజృంభనతో ప్రపంచ మానవాళి, సమస్త సామాజిక వ్యవస్థలు లాక్‌డౌన్, కర్ఫ్యూ, సామాజిక క్రమశిక్షణల కారణంగా 7.7 శాతం డిటిపి-3 (డిఫ్తీరియా, టెటనస్, పెర్‌ట్యుసిస్) టీకాల కార్యక్రమం (సాధారణ పరిస్థితులతో పోల్చితే), 7.9 శాతం యంసివి-1 (మీసిల్స్ కంటేనింగ్ వ్యాక్సీన్) టీకాల కార్యక్రమం తగ్గాయని తెలుస్తున్నది. జనవరి -డిసెంబర్ 2020 మధ్య 30 మిలియన్ల పిల్లలు డిటిపి-3ని, 27.2 మిలియన్ పిల్లలు యంసివి-1 టీకాలను పొందలేక పోయారని తెలుస్తున్నది. 2020 ఏప్రిల్ మాసంలో అత్యధికంగా 4.6 మిలియన్ పిల్లలు (31.3 శాతం) డిటిపి-3 టీకాలను, 4.4 మిలియన్ పిల్లలు (30.1 శాతం) యంసివి-1 టీకాలకు కరోనా వల్ల దూరం అయ్యారు. అర్హతగల పిల్లల్లో డిటిపి-3 టీకాలను 76.7 శాతం, యంసివి-1 టీకాలు 78.9 శాతం మాత్రమే పొందగలిగారని వివరించింది. ఉత్తర/ లాటిన్ అమెరికా, మిడిల్ ఈస్ట్, దక్షిణ ఆసియా, కరేబియన్ దేశాల్లో సాధారణ టీకా కార్యక్రమానికి కరోనా వల్ల అధిక ఆటంకాలు ఏర్పడడం గమనించారు. 2020 రెండవ అర్ధభాగంలో టీకా కార్యక్రమం తిరిగి పుంజుకుందనే వార్త కొంత అపశమనాన్ని ఇచ్చింది. పలు వ్యాధులకు జీవితకాలం రక్షణ కల్పించే ముఖ్య టీకాలకు పిల్లలు దూరం కావడం లేదా పాక్షికంగా పొందడంతో వారి జీవితకాల ఆరోగ్యంపై తీవ్రప్రభావం పడవచ్చని హెచ్చరిస్తున్నారు. 2020లో టీకాలు పొందని పిల్లలకు 2021లో అయినా టీకాలు వేయించడానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని సూచించారు.

**భారత దేశ స్థాయిలో?.**

కరోనా ప్రభావంతో ఇండియాలో టీకా కార్యక్రమం అధిక ఆటంకాలను ఎదుర్కొంటున్నదని తెలుస్తున్నది. భారతదేశంలో కూడా కరోనా విపత్తు ఉప్పెన వల్ల పిల్లల టీకా కార్యక్రమం 2020లో 70 శాతం మాత్రమే జరిగిందని, 30 శాతం పిల్లలకు సకాలంలో వ్యాక్సినేషన్ అందలేదనేది వాస్తవం. కరోనా తొలి, రెండవ వేవ్ కారణంగా ఆరోగ్య / పారామెడికల్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇవ్వాల్సిన టీకాలను అందించలేక పోవడం జరిగింది. ఇండియాలో ప్రతి ఏట 2.65 కోట్ల పిల్లలు, 2.9 కోట్ల గర్భిణి స్త్రీలు 'యునివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్' కింద టీకాలు పొంది 12 వ్యాధుల నుంచి రక్షణ పొందుతున్నారు. పిల్లల వైద్యుల వివరాల ప్రకారం కొన్ని సమయాల్లో 50 శాతం వరకు టీకా కార్యక్రమం తగ్గిందని తెలుపడం విచారకరం. డబ్ల్యూహెచ్ఓ అంచనాల ప్రకారం కోవిడ్-19 కారణంగా మిలియన్ల భారతీయ పిల్లలు టీకా అందని కారణంగా ప్రమాదంలో పడవచ్చని తెలిపారు. భారత్‌లో జనవరి - మార్చి 2021లో డిటిపి-3 టీకాలు 99 శాతం అందగా, టీకాలు పొందని లేదా పాక్షికంగా పొందిన పిల్లలను గుర్తించి తగు చర్యలు సత్వరమే తీసుకోవాలని సూచిస్తున్నారు. 23 మిలియన్ల బాలలు 2020లో సాధారణ టీకాలు పొందలేక (2019తో పోల్చితే అదనంగా 3.7 మిలియన్ల పిల్లలు) పోయారు. కరోనా ఉచ్చులో చిక్కిన పేద మురికి వాడల కుటుంబాలకు చెందిన 17 మిలియన్ల పిల్లల పరిస్థితి నేటికీ దయనీయంగా మారింది. నేటి చిన్నారులకు సకాలంలో అందవలసిన టీకాలను అందిస్తూ, రేపటి బాధ్యతగల ఆరోగ్యవంతమైన పౌరసమాజాన్ని తయారు చేయాల్సిన యజ్ఞంలో ప్రభుత్వం, ప్రజలు, తల్లితండ్రులు తమదైన ప్రత్యేక పాత్రను పోషించాడానికి ముందుకు రావాలని కోరుకుందాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## సింహాలసంరక్షణ పట్ల మక్కువ ను కలిగి ఉన్న వారందరికీ అభినందనలు తెలిపిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 10:సింహాల సంరక్షణ పట్ల మక్కువను కలిగి ఉన్న వారందరికీ ప్రపంచ సింహాల దినం సందర్భంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ అభినందనలు తెలిపారు.

"సింహం సాహసవంతమైందీ, ఠీవి ఉట్టిపడేదీ నూ. ఆసియా ప్రాంతం లో సంతరించే ప్రత్యేక సంతతి సింహాల కు ఆశ్రయాన్ని ఇస్తున్నందుకు గాను భారతదేశం గర్వపడుతోంది. సింహాల సంరక్షణ విషయంలో మక్కువను కలిగిన వారందరికి 'వరల్డ్ లయన్ డే' సందర్భంలో నేను నా అభినందనలను తెలియజేస్తున్నాను. గడచిన కొన్ని సంవత్సరాలుగా భారతదేశంలో సింహాల సంతతి నిలకడగా వృద్ధి చెందుతున్న సంగతి తెలిస్తే మీరు సంతోషిస్తారు.

గుజరాత్ ముఖ్యమంత్రి గా నేను నా సేవలను అందించిన కాలం లో గీర్ సింహాల కోసం సురక్షితమైనటువంటి, భద్రమైనటువంటి ఆవాసాలను ఏర్పాటు చేసే దిశలో కృషి చేసే అవకాశం నాకు లభించింది. ఆయా ఆవాసాలను పదిలంగా ఉంచడం కోసం స్థానిక సముదాయాల ప్రమేయంతో అనేక కార్యక్రమాలను చేపట్టడం తో పాటు ప్రపంచంలో అవలంబిస్తున్నటువంటి ఉత్తమమైన అభ్యాసాలను అనుసరించడం కూడా జరిగింది. మరి ఈ కారణంగా పర్యటన రంగానికి కూడా ప్రోత్సాహం లభిస్తుంది."

## టీఆర్ఎస్ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కు బెదిరింపులు

హైదరాబాద్ , ఆగష్టు 10:ఇటీవల బీఎస్పీలో చేరిన ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను ఉద్దేశిస్తూ టీఆర్ఎస్ ఎమ్మెల్యే గాదరి కిషోర్ సోమవారం నాడు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కుట్రలో భాగంగానే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలంగాణ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కేసీఆర్‌ను తిట్టి హీరో కావాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చూస్తున్నారని గాదరి కిషోర్ మండిపడ్డారు.

అయితే ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై గాదరి కిషోర్ అనుచిత వ్యాఖ్యలు చేయడంతో స్వేరోస్‌కు చెందిన ఓ కార్యకర్త తట్టుకోలేకపోయాడు. దీంతో స్వయంగా ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. తాను స్వేరో సంపత్‌గా పరిచయం చేసుకున్న ఆ వ్యక్తి? ప్రవీణ్ కుమార్‌పై విమర్శలు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టాడు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను తిట్టే స్థాయి లేదంటూ ఎమ్మెల్యేకు వార్నింగ్ ఇచ్చాడు.

అయితే ఆ వ్యక్తి బెదిరింపులకు లొంగని ఎమ్మెల్యే గాదరి కిషోర్ అంతే స్థాయిలో కౌంటర్ ఇచ్చారు. తాను బెదిరిస్తే బెదిరిపోయే వ్యక్తిని కాదని? తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర వహించినట్లు పేర్కొన్నారు. గాదరి కిషోర్ అంటే మామూలు వ్యక్తి కాదని కౌంటర్ ఇచ్చారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బెదిరించమని ప్రోత్సహిస్తే నువ్వు బెదిరిస్తున్నావా?అంటూ నిలదీశారు. ఇలాంటి బెదిరింపులకు భయపడే వ్యక్తిని తాను కాదని స్పష్టం చేశారు. మరోసారి ఇలా బెదిరింపులకు దిగితే? పోలీసులకు ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే గాదరి కిషోర్ పేర్కొన్నారు.

## క్రికెట్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్.. ఒలింపిక్స్‌లో జెంటిల్ మేన్ గేమ్

న్యూఢిల్లీ, ఆగష్టు 10:మనదేశం క్రీడా హాకీ అయినప్పటికి.. క్రికెట్ కే ఎక్కువ ఆదరణ. అంతేకాదు క్రికెట్ ఆట ప్రపంచంలోనే అత్యంత ఆదరణ కలిగిన క్రీడల్లో టాప్ టెన్ లో స్థానం దక్కించుకుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు.. అయితే ఇప్పటి వరకు ఇంత ఆదరణ కలిగిన క్రికెట్ కి ఒలింపిక్స్ లో ప్రాతినిధ్యం లేదు.. ఈ క్రమంలోనే ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను భాగం చేయాలనే వాదన ఎప్పటి నుంచో వినిపిస్తోంది. అయితే ఇది కార్యరూపం దాల్చడడం లేదు. గతంలో 1900లో పారిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను భాగం చేశారు. కానీ అనంతరం దానిని కొనసాగించలేదు. ఇదిలా ఉంటే తాజాగా ఒలింపిక్స్‌లో క్రికెట్ అనే అంశం మరోసారి తెరపైకి వచ్చింది.

కాగా ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను ఎప్పుడు చేర్చినా తాము సిద్ధమేనంటూ బీసీసీఐ సెక్రటరీ జై షా వెల్లడించారు. ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను భాగం చేసేందుకు ఐసీసీతో కలిసి బీసీసీఐ ప్రయత్నాలు చేస్తుందని తెలిపారు. ఇదిలా ఉంటే ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను భాగం చేయాలని గతంలోనే అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐఓసీ) తో ఐసీసీ చర్చలు జరిపింది. అయితే, అప్పుడు బీసీసీఐ అందుకు అంగీకారం తెలపలేదు. కానీ ప్రస్తుతం బీసీసీఐ సానుకూలంగా స్పందించడంతో ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. అన్నీ అనుకున్నట్లు జరిగితే 2028 లాస్ ఏంజెల్స్‌లో జరిగే ఒలింపిక్స్‌లో క్రికెట్ ఉంటుందని చెబుతున్నారు. ఇక ఎనిమిది టీమ్‌ల మధ్య పోరు ఉండనున్నట్లు భావిస్తున్నారు. అలాగే ఫార్మట్ విషయానికొస్తే టీ 20 లేదా టీ 10లను నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

## జమ్ము కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణకు రాహుల్ డిమాండ్

శ్రీనగర్ , ఆగష్టు 10: జమ్ము కశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదా పునరుద్దరించాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం డిమాండ్ చేశారు. కశ్మీర్‌లో రెండు రోజుల పర్యటనకు వచ్చిన రాహుల్ జమ్ము కశ్మీర్‌లో స్వేచ్ఛగా నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ప్రజాస్వామిక వ్యవస్థలపై పాలక బీజేపీ దాడి చేస్తోందని దుయ్యబట్టారు. శ్రీనగర్‌లో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి రాహుల్ మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీ వంటి చట్టసభలతో పాటు న్యాయవ్యవస్థపైనా కాషాయ పార్టీ దాడి చేస్తోందని, మీడియా గొంతు నొక్కుతున్నారని మండిపడ్డారు.

అంతకుముందు రాహుల్ ఖీర్ భవానీ ఆలయం, హజ్రత్‌బల్ మసీదును సందర్శించారు. ఇక రాహుల్ శ్రీనగర్‌లో పార్టీ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించి కాంగ్రెస్ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. మరోవైపు జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 రద్దు అనంతరం రాహుల్ తొలిసారిగా ఇక్కడ పర్యటిస్తున్నారు.

## గ్రామీణ ప్రాంతాల కోసం FPI పథకాలు

న్యూఢిల్లీ, ఆగష్టు 10::ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ (ఎంఓఎఫ్‌పిఐ) 2016-17 నుండి వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ మరియు ఆదాయాన్ని పెంచడంతో పాటుగా ఆహార ప్రాసెసింగ్ రంగానికి సంబంధించిన వృద్ధి మరియు అభివృద్ధి కోసం సెంట్రల్ సెక్టార్ పథకం- ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన (పిఎంకెఎస్‌వై)ను అమలు చేస్తోంది. పిఎంకెఎస్‌వై యొక్క కాంపోనెంట్ స్కీమ్‌లు - (i) మెగా ఫుడ్ పార్క్, (ii) ఇంటిగ్రేటెడ్ కోల్డ్ చైన్ మరియు వాల్యూ యాడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, (iii) ఫుడ్ ప్రాసెసింగ్ & ప్రిజర్వేషన్ సామర్థ్యాల ఏర్పాటు /విస్తరణ, (iv) వ్యవసాయ ప్రాసెసింగ్ క్లస్టర్‌ల కోసం మౌలిక సదుపాయాలు, (v) వెనుకబడిన & ఫార్వర్డ్ లింకేజీల సృష్టి, (vi) ఆహార భద్రత మరియు నాణ్యత భరోసా మౌలిక సదుపాయాలు, (vii) మానవ వనరులు మరియు సంస్థలు, (viii) ఆపరేషన్ గ్రీన్స్. పిఎంకెఎస్‌వై కాంపోనెంట్ స్కీమ్‌ల కింద ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఎక్కువగా క్రెడిట్ లింక్డ్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ (క్యాపిటల్ సబ్సిడీ) ని గ్రాంట్-ఇన్-ఎయిడ్ రూపంలో ఫుడ్ ప్రాసెసింగ్ / ప్రిజర్వేషన్ పరిశ్రమల ఏర్పాటు కోసం అందిస్తుంది. పిఎంకెఎస్‌వై అనేది ప్రాంతం లేదా రాష్ట్ర నిర్దిష్టమైనది కాదు. ఇది డిమాండ్ ఆధారితమైనది మరియు తమిళనాడు గ్రామీణ ప్రాంతాలతో సహా దేశవ్యాప్తంగా అమలు చేయబడుతుంది. ఇప్పటివరకు, మంత్రిత్వ శాఖ 41 మెగా ఫుడ్ పార్కులు, 353 కోల్డ్ చైన్ ప్రాజెక్ట్‌లు, 63 ఆగ్రో ప్రాసెసింగ్ క్లస్టర్‌లు, 292 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, 63 బ్యాక్‌వర్డ్ & ఫార్వర్డ్ లింకేజీ ప్రాజెక్ట్‌లు & 6 ఆపరేషన్ గ్రీన్ ప్రాజెక్ట్‌లను పిఎంకెఎస్‌వైకు చెందిన కాంపోనెంట్ స్కీమ్‌ల కింద ఆమోదించింది. వీటిలో 1 మెగా ఫుడ్ పార్క్ ప్రాజెక్ట్, 17 కోల్డ్ చైన్ ప్రాజెక్ట్‌లు, 10 ఆగ్రో ప్రాసెసింగ్ క్లస్టర్‌లు, 22 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, 9 బ్యాక్‌వర్డ్ & ఫార్వర్డ్ లింకేజీ ప్రాజెక్ట్‌లు & 20 ఫుడ్ టెస్ట్ లాబొరేటరీ ప్రాజెక్ట్‌లను తమిళనాడులో పిఎంకెఎస్‌వై సంబంధిత కాంపోనెంట్ స్కీమ్‌ల కింద మంత్రిత్వ శాఖ ఆమోదించింది.

పిఎంకెఎస్‌వై కాంపోనెంట్ స్కీమ్‌ల కింద దేశవ్యాప్తంగా మంజూరు చేయబడిన ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత దాదాపు 34 లక్షల మందికి ప్రయోజనం చేకూరుస్తాయని అంచనా. 2020 సంవత్సరంలో ఎం/ఎస్ నాబార్డ్ కన్సల్టెన్సీ లిమిటెడ్ (నాబ్‌కాన్స్) నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ కోల్డ్ చైన్ మరియు వాల్యూ యాడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్కీమ్ మూల్యాంకన అధ్యయనంలో ఈ పథకం కింద క్యాప్టివ్ ప్రాజెక్టులు 12.38 % వ్యవసాయ గేట్ ధరలను పెంచాయని అంచనా వేయబడింది. మరియు ప్రతి ప్రాజెక్ట్ 9500 మందికి పైగా రైతులకు ప్రయోజనం చేకూరుస్తుందని అంచనా.

అలాగే ఆత్మనిర్భర్ భారత్ చొరవలో భాగంగా ఎంఓఎఫ్‌పిఐ 2 లక్షల మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజ్‌లను ఏర్పాటు చేయడానికి లేదా అప్‌గ్రేడ్ చేయడానికి ఆర్థిక, సాంకేతిక మరియు వ్యాపార మద్దతును అందించడానికి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ స్కీమ్ (పిఎంఎఫ్ఎంఈ) యొక్క కేంద్ర ప్రాయోజిత పథకమైన పిఎం ఫార్మలైజేషన్‌ను క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ 2020-21 నుండి 2024-25 వరకు ఐదు సంవత్సరాలలో రూ .10,000 కోట్లతో అమలు చేస్తోంది. ఇందులో మొత్తం 12128 యూనిట్లు ఐదేళ్లలో తమిళనాడుకు రూ .572.71 కోట్ల తాత్కాలిక వ్యయంతో కేటాయించబడ్డాయి.

## దళితులకు అండగా ఉంటా.. గడీల పాలనను పారదోలుతా: రేవంత్



హైదరాబాద్ , ఆగష్టు 10:ఈనెల 18న ఇబ్రహీంపట్నంలో దళిత, గిరిజన రెండో సభ నిర్వహించనున్నామని టీ.పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ప్రకటించారు. స్వేచ్ఛ, స్వయం పాలన కోసమే సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని తెలిపారు. ఇకపై కాంగ్రెస్‌లో పార్టీని నమ్ముకున్న వారికే పదవులు ఉంటాయని స్పష్టం చేశారు. ఇందిరమ్మ పాలనలోనే ఎస్సీలకు అసైన్డ్ భూములు వచ్చాయని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో నిర్వహించిన దళిత, గిరిజన రెండో సభలో రేవంత్ ప్రసంగించారు. కార్యక్రమం విజయవంతం కావడంపై సంతోషం వ్యక్తం చేశారు.

ఇంద్రవెల్లి పేరు స్మరిస్తే ఎంతో స్ఫూర్తి రగులుతుందని టీపీసీసీ చీఫ్? రేవంత్? రెడ్డి అన్నారు. స్వేచ్ఛ కోసం పోరాడి, ప్రాణాలు ఇచ్చిన నేల ఇంద్రవెల్లి అని ఆయన గుర్తు చేశారు. నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుమురం భీం పోరాడారని చెప్పారు. ఒకప్పుడు ఆదిలాబాద్ పేరు చెపితే పోరాట యోధులు గుర్తుకు వచ్చేవారని? ఇప్పుడేమో కేసీఆర్ అడుగులకు మడుగులొత్తే నేతలు గుర్తుకు వస్తున్నారని విమర్శించారు. దళిత సోదరులకు అండగా ఉంటానని రేవంత్ భరోసా ఇచ్చారు. దళితుడికి రాష్ట్రపతి పదవి ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని తెలిపారు. లోక్‌సభ స్పీకర్‌గా మీరాకు మార్‌ను చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని గుర్తు చేశారు. రిజర్వేషన్లు ఇచ్చింది కూడా కాంగ్రెస్ పార్టీనేనని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఉపఎన్నికలు వస్తేనే సీఎం కేసీఆర్‌కు దళితులు గుర్తుకు వచ్చారని, కేసీఆర్ మంత్రివర్గంలో మాదిగలకు స్థానమే లేదని విమర్శించారు. చివరి రక్తపు బొట్టు వరకు ప్రజలకు తోడు, నీడగా ఉంటానని రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. సమైక్యపాలనలో అడవి బిడ్డలను కాల్చేస్తుంటే? ఈ ప్రాంత నేతలు నిస్సహాయులుగా నిలిచిపోయారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు.

ఉమ్మడి రాష్ట్రంలో ఆదిలాబాద్‌కూ అన్యాయం జరిగిందని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. అమరుల కుటుంబాలను ఆదుకునే బాధ్యత కాంగ్రెస్‌దేనని అన్నారు. ఎందరో ఎస్సీలు, ఎస్టీలకు కీలక పదవులను ఇచ్చింది కాంగ్రెస్సేనని అన్నారు. రిజర్వేషన్ల విధానాన్ని తీసుకువచ్చిందే కాంగ్రెస్ పార్టీనని తెలిపారు. తెలంగాణకు ఎస్సీ నేతను తొలి సీఎం చేస్తానని కేసీఆర్ అన్నారని? కానీ ఎస్సీని ఉపముఖ్యమంత్రిని చేసి రెన్నెళ్లకే కేసీఆర్ తొలగించారని విమర్శించారు. కేసీఆర్ మంత్రివర్గంలో ఎస్సీలకు చోటు దక్కలేదని ఆయన ఆరోపించారు. ఆదివాసీల జీవితాలు మార్చాలనేదే కాంగ్రెస్ ప్రణాళికలని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల కోసమే పథకాలు తెచ్చారని సీఎం ఒప్పుకున్నారని చెప్పారు. ఉప ఎన్నికలు వస్తేనే కేసీఆర్‌కు ఎస్సీలు గుర్తుకు వచ్చారని? దళితబంధును అన్ని నియోజకవర్గాల్లో ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. రూ.4 లక్షల కోట్ల అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విమర్శించారు. కాంట్రాక్టులు, కమిషన్ల ద్వారా వేల కోట్లను కేసీఆర్ కుటుంబం దోచుకుందని ఆరోపించారు.

## మొక్కలు నాటుదాం.. సంరక్షిద్దాం

హైదరాబాద్ , ఆగష్టు 10: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పిలుపునిచ్చారు. హరితహారంలో భాగంగా సోమవారం అంబర్‌పేటలోని కాచిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్‌శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నగర సీపీ అంజనీకుమార్, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, అడిషనల్ కమిషనర్ చౌహాన్, డీసీపీ రమేశ్, అడిషనల్ డీసీపీ మురళీధర్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. సీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్లు పచ్చని అందాలతో ఆహ్లాదకర వాతావరణానికి నిలయాలుగా మారుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ అనిల్‌కుమార్, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఖర్చు లేకుండా కసరత్తు చేయొచ్చు

హైదరాబాద్ , ఆగష్టు 10: ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణంలో పచ్చని అందాల మధ్య స్వచ్ఛమైన గాలిపీలుస్తూ కసరత్తులు చేసేలా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్ జయశంకర్‌పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, కమాన్ (ఆర్చ్)ను కార్పొరేటర్లు పూజితగౌడ్, జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం హరితహారం కార్యక్రమంలో భాగంగా కాలనీవాసులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యమే పరమావధిగా పచ్చని అందాల మధ్య కసరత్తులు చేసుకొనేలా ఓపెన్‌జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూపాయి ఖర్చులేకుండా పచ్చని ఆహ్లాదకరవాతావరణంలో స్వచ్ఛమైన గాలి పీలుస్తూ అత్యాధునికవసతులతోకూడిన ఓపెన్‌జిమ్‌లను జీహెచ్ఎంసీ అధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కార్పొరేటర్ పూజితగౌడ్ మాట్లాడుతూ.. రాళ్లురప్పలకు నిలయమైన ఆ ప్రాంతాన్ని లక్షల రూపాయలు వెచ్చించి పచ్చదనం వెల్లివిరిసేలా చేయడమేగాకుండా ప్రస్తుతం అదనపు హంగులతో ఓపెన్‌జిమ్ ఏర్పాటు కావడం ఎమ్మెల్యే చొరవతోనే సాధ్యమైందని అందుకు డివిజన్ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, డివిజన్ అధ్యక్షుడు బాల్లింగ్ గౌతంగౌడ్, గౌరవాధ్యక్షుడు వాలా హరీశ్, లక్ష్మారెడ్డి, సాయిబాబా, మనోహర్‌గౌడ్, శ్రీనివాస్, రవికుమార్, చంద్రశేఖర్, రాజేశ్వర్‌గౌడ్, మోసినుద్దీన్, నాగేశ్వరరావు, ప్రభాకర్‌రావు, ప్రసాద్, నారాయణరెడ్డి, జ్ఞానేశ్వర్, బాలసుబ్బయ్య, భగత్, శ్రీను, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## జగన్ ప్రభుత్వానికి కేంద్రం మరో ఝులక్

అమరావతి, ఆగష్టు 10:ఏపీలో జగన్ సర్కారుపై కేంద్రానికి వరుసగా ఫిర్యాదులు చేస్తున్న రెబల్ ఎంపీ రఘురామకృష్ణంరాజు అందుకు అనుగుణంగా ఫలితాలు అందుకుంటున్నారు. గతంలో రఘురామ చేసిన ఓ ఫిర్యాదుకు సంబంధించి స్పందించిన కేంద్ర హోంశాఖ ఏపీ సీఐడీ ఛీఫ్ పీవీ సునీల్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని జగన్ సర్కార్‌కు ఆదేశాలు జారీ చేసింది.

జగన్ ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో రఘురామ చేసిన వ్యాఖ్యల ఆధారంగా ఆయనపై సీఐడీ ఛీఫ్ పీవీ సునీల్ కుమార్ రాజద్రోహం కేసు మోపారు. బెయిల్‌కు వీలు లేని కేసుల్లో ఒకటైన రాజద్రోహం కేసులో రఘురామను హైదరాబాద్ వెళ్లి మరీ అరెస్టు చేయడమే కాకుండా ఆయన్ను కస్టడీలోకి తీసుకుని చేయిచేసుకున్నట్లు కూడా ప్రచారం జరిగింది. ఈ విషయాన్ని రఘురామ స్వయంగా సుప్రీంకోర్టులో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. కస్టడీలో రఘురామపై సీఐడీ అధికారులు దాడి చేసినట్లు నిర్ధారించింది. దీంతో రఘురామ తనపై కస్టడీలో దాడి చేయించిన సీఐడీ ఛీఫ్ సునీల్ కుమార్‌పై రగిలి పోతున్నారు.

సీఐడీ ఛీఫ్‌గా సీఎం జగన్ ఏరికోరి తెచ్చుకున్న పీవీ సునీల్ కుమార్‌ను ఎలా టార్గెట్ చేయాలా అని ఆలోచిస్తున్న రఘురామకు రెండు విషయాలు దొరికాయి. ఇందులో ఒకటి గతంలో పీవీ సునీల్ కుమార్ పై నమోదైన వరకట్నం కేసు కాగా.. మరొకటి ఆయన హిందూ మతానికి వ్యతిరేకంగా చేసిన విద్వేష వ్యాఖ్యలు చేసిన వ్యవహారం. ఈ రెండు కేసుల విషయంలో సీఐడీ చీఫ్‌ను రఘురామ టార్గెట్ చేయగా.. ఈ కేసులకు సంబంధించి ఇప్పటికే ఏపీ ప్రభుత్వానికి కేంద్ర హోంశాఖ లేఖలు రాసినట్లు తెలుస్తోంది.

కాగా ఏపీ ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న సమయంలో పీవీ సునీల్‌కుమార్‌పై ఆయన భార్య పి.అరుణ వరకట్న వేధింపుల కేసు పెట్టారు. దీంతో అప్పటి అధికారులు ఆయనపై వరకట్న వేధింపుల చట్టం కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో తాను అరెస్టు కాకుండా కోర్టుకు వెళ్లి సునీల్ కుమార్ మినహాయింపు తెచ్చుకున్నారు. అయితే ఆ తర్వాత ఆయన ఏపీ సీఐడీ ఛీఫ్‌గా కీలక బాధ్యతలు చేపట్టారు. దీంతో వరకట్న వేధింపుల కేసు ఎదుర్కొంటున్న సునీల్ కుమార్‌కు సీఐడీ ఛీఫ్ వంటి కీలక పదవి ఎలా అప్పగిస్తారని రఘురామకృష్ణంరాజు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేసిన రఘురామ.. ఆయన్ను ఆ పదవి నుంచి తప్పించాలని కోరారు.

## హుజురాబాద్ నియోజకవర్గంలో వైఎస్ షర్మిల నిరాహార దీక్ష

న్యూఢిల్లీ, ఆగష్టు 10:వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండలం సిరిసేడు గ్రామంలో నిరుద్యోగ నిరాహార దీక్షకు దిగారు. ప్రతి మంగళవారం ఆమె నిరుద్యోగ వారం-నిరుద్యోగుల కోసం నిరాహార దీక్ష చేపడుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సిరిసేడు గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న నిరుద్యోగి మహమ్మద్ షబ్బీర్ కుటుంబాన్ని ఆమె పరామర్శించారు.

షబ్బీర్ తల్లిదండ్రులను ఓదార్చి వారికి అండగా ఉంటామని షర్మిల భరోసా ఇచ్చారు. అనంతరం పలువురు నేతలతో కలిసి సిరిసేడులో దీక్షలో కూర్చున్నారు. ఈ దీక్ష సాయంత్రం 5 గంటల వరకు జరగనుంది. తెలంగాణలో లక్షా 90 వేల ఉద్యోగాలను భర్తీ చేసే వరకు తాను పోరాడుతూనే ఉంటానని షర్మిల గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే.

## పనుల్లో వేగం పెంచాలి

హైదరాబాద్ , ఆగష్టు 10: రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని ఆర్‌పీ రోడ్డులో రూ. 2.35 కోట్ల వ్యయంతో చేపడుతున్న వంతెన విస్తరణ పనులను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోమవారం ఉదయం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులను పరిశీలిస్తూ వంతెన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన మట్లాడుతూ వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వరద నీరు రోడ్లపైకి చేరుతుండడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతుండడమే కాక ముంపు సమస్యకు దారి తీస్తోందన్నారు. అయితే ఈ వంతెన విస్తీర్ణం పెరిగితే వరదనీరు సాఫీగా పోయేందుకు అవకాశం ఉందని నిపుణులు చేసిన సూచనల మేరకు వంతెన విస్తరణ పనులను చేపట్టామని తెలిపారు. అయితే సంబంధిత పోలీస్, జీహెచ్ఎంసీ విభాగం అధికారులు సమన్వయంతో వ్యవహరించి వంతెన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని అ న్నారు. నిర్మాణం ఒకవైపు పూర్తయిన పరిస్థితుల్లో వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయని వివరించారు. డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి, ఎస్ఈ అనిల్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ కృష్ణమోహన్, జలమండలి జీఎం రమణారెడ్డి, మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్ పాల్గొన్నారు.



# రైతులు పామాయిల్ పంటలపై ఆసక్తి చూపాలి: మంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్ , ఆగష్టు 10: రైతులు సామాయిల్ పంటలపై ఆసక్తి చూపాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కోరారు. సోమవారం మండల పరిధిలోని ఆకులమైలారంలో మీర్‌ఖాన్‌పేట్‌లో 22 లక్షలతో నిర్మించిన రైతు వేదిక, 10లక్షల రూపాలయతో నిర్మించే ముదిరాజ్ భవనానికి శంకుస్థాపన చేశారు.అదే విధంగా సీసీ రోడ్లను, వైకుంఠ ధామలను ప్రారంభించారు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. వావిళ్లకుంట తండలో 79లక్షల 60వేల రూపాయలతో నిర్మించే సీసీ రోడ్లు, అండర్‌డ్రైనేజి పనులకు శంకుస్థాన చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ పామాయిల్ పంటలను సాగు చేస్తే ప్రభుత్వం ఎకరాకు 30వేల రూపాయలను సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. ఆ పంట 30సంవత్సరాల పాటు ఉంటుందని వివరించారు. రైతులు లాభసాటి పంటలను వేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. సీఎం కేసీఆర్ అన్ని రంగాలకు సమ ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. రాష్ట్ర పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని వివరించారు. రైతులకు మద్దతు ధరను ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. వరి సాగులో రాష్ట్రం ముందంజలో ఉన్నట్లు పేర్కొన్నారు.

రైతు బీమా, రైతు బంధు రైతుల కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నట్లు తెలిపారు.రైతు బీమాకు ప్రభుత్వం ప్రతియేటా 1200కోట్లు చెల్లిస్తున్నట్లు తెలిపారు.ఉచిత విద్యుత్‌కు 10వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు.అటు చినుకులు పడగానే ఇటు రైతుల ఖాతాల్లో డబ్బులు పడుతున్నట్లు పేర్కొన్నారు.దళిత బంధు పథకం చరిత్రలో నిలుస్తుందని పేర్కొన్నారు. దీనికి కూడ ప్రతి పక్షాలు రాజకీయం చేస్తున్నాయని అన్నారు.

సర్పంచ్ జ్యోతి చంద్రశేఖర్ ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైతు బంధు జిల్లా అధ్యక్షుడు వంగేటి లకా?ష్మారెడ్డి, జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, ఎంపీపీ మంద జ్యోతి పాండు, వైస్ ఎంపీపీ శమంత ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురుసాని వరలక్ష్మి సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు చంద్రశేఖర్, వైఎస్ చైర్మన్ గోపిరెడ్డి విజేందర్‌రెడ్డి, మండల రైతు బంధు అధ్యక్షులు క్రిష్ణరాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

# 44 జిల్లాల్లో పదిశాతం పైగా పాజిటివిటీ రేటు!

న్యూఢిల్లీ, ఆగష్టు 10: దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాల్లోని 44 జిల్లాల్లో కొవిడ్-19 పాజిటివిటీ రేటు గత వారం పదిశాతం పైగా నమోదైందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కేరళలో ఈ తరహా జిల్లాలు ఆరు కాగా, ఈశాన్య రాష్ట్రాల్లో 29 జిల్లాలు, రాజస్థాన్‌లో రెండు జిల్లాలు, హిమాచల్ ప్రదేశ్‌లో ఒక జిల్లా ఉన్నాయని పేర్కొంది. ఇక అధిక పాజిటివిటీ రేటు నమోదవుతున్న జిల్లాల్లో పశ్చిమ బెంగాల్‌లో ఒక జిల్లా, పుదుచ్చేరి నుంచి ఒక జిల్లా ఉన్నాయని తెలిపింది.

మరోవైపు దేశవ్యాప్తంగా ఇప్పటివరకూ 40 కోట్ల మందికి పైగా ప్రజలకు కొవిడ్-19 వ్యాక్సిన్ తొలి డోసు పూర్తయిందని వెల్లడించింది. వ్యాక్సినేషన్ రేటు క్రమంగా పెరుగుతోందని ఆరోగ్య మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ పేర్కొన్నారు. ఇక దేశంలో డెల్టా వేరియంట్ ప్రభావాన్ని మదింపు చేస్తున్నామని నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్కే సింగ్ వెల్లడించారు. అన్ని రాష్ట్రాల్లోని ప్రతి జిల్లాలో శాంపిల్స్ సేకరించి జీనోమ్ సీక్వెన్సింగ్ చేపట్టాలని, రాబోయే రోజుల్లో నూతన వేరియంట్ల ప్రభావాన్ని దీంతో అంచనా వేయవచ్చని డబ్ల్యూహెచ్ఓ సూచిస్తోందని డాక్టర్ సింగ్ పేర్కొన్నారు.

# ఏపీలో ఈనెల 16 నుంచి స్కూళ్లు రీ ఓపెన్

అమరావతి, ఆగష్టు 10:ఏపీలో స్కూళ్ల రీ ఓపెన్‌పై విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ కీలక ప్రకటన చేశారు. ఈ నెల 16 నుంచి స్కూళ్లను రీ-ఓపెన్ చేస్తున్నట్లు వెల్లడించారు. రెగ్యులర్ టైమింగ్సులోనే స్కూళ్లను రన్ చేస్తామని, కోవిడ్ ప్రొటోకాల్ పాటించేలా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రి సురేష్ పేర్కొన్నారు. ఇప్పటివరకు ఏపీ వ్యాప్తంగా 95 శాతం మంది టీచర్లకు వ్యాక్సినేషన్ పూర్తయిందని తెలిపారు. వ్యాక్సిన్ వేయించుకోని మిగిలిన టీచర్లకు కూడా టీకాలు వేయాల్సిందిగా కలెక్టర్లను ఆదేశించామన్నారు.

ఏపీలో ఆన్ లైన్ తరగతులు ఎక్కడా జరగడం లేదని మంత్రి ఆదిమూలపు సురేష్ వివరించారు. ప్రైవేట్ పాఠాశాలల్లో ఆన్ లైన్ తరగతులు నడపొద్దని ఆదేశించామన్నారు.ఈ నెల 16 నుంచి ఆఫ్ లైన్‌లోనే పూర్తి స్థాయిలో పాఠశాలలను నిర్వహిస్తామన్నారు. పాఠశాలలో తప్పనిసరిగా కరోనా నియమ నిబంధనలను పాటించాలని ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా మాస్కులు, శానిటైజర్‌లు వాడటం తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు.

# అమల్లో ఉన్న పనుల్లో వేగం పెరగాలి

హైదరాబాద్ , ఆగష్టు 10:పాతబస్తీలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం పాతబస్తీలో పురపాలక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో కలిసి మంత్రి కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. వివిధ నియోజకవర్గాల్లో ఎస్ఆర్‌డీపీ కింద నిర్మిస్తున్న ఫ్లై ఓవర్లు, రహదారులు, నాలాల వెడల్పు, డబుల్ బెడ్ రూం గృహాలు, తాగునీటి రిజర్వాయర్ పైప్‌లైన్లు, ఇతర మౌలిక వసతుల కల్పనపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో అవాంతరాలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తేవాలని అధికారులకు సూచించారు. గడువులోగా పనులు పూర్తి చేసేలా ఉన్నతాధికారులు శ్రద్ధ వహించాలన్నారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులకు చేయూతనివ్వడం అభినందనీయం



హైదరాబాద్ , ఆగష్టు 10:స్వచ్ఛంద సంస్థలు సేవా దృక్పదంతో జర్నలిస్టులకు చేయూత అందించడం అభినందనీయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఈ మేరకు సోమవారం సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(ఎస్ఆర్‌డీ) స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కరోనా సమయంలో ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా ముందుండి తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన ముషీరాబాద్ నియోజక వర్గ జర్నలిస్టులకు నిత్యావసర సరుకుల కిట్‌లను ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఠా గోపాల్ మాట్లాడుతూ కరోనా సమయంలో జర్నలిస్టులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గత రెండేండ్ల నుంచి మూడు దఫాలుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం హర్షనీయమని అన్నారు. ఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత రెండేండ్ల నుంచి జర్నలిస్టులకే కాకుండా నిరుపేద ప్రజలకు దాదాపు 10 వేల విలువ గల నిత్యావసర సరుకుల కిట్లు అందజేశామని ఆయన తెలిపారు. అదే విధంగా జర్నలిస్టుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లే కాకుండా, వారు చదువుకునేందుకు తమ వంతు ఆర్థిక సహాయం అందిస్తామని ఆయన వెల్లడించారు. వారి వివరాలను తమకు అందజేసినట్లైతే ఆర్థిక సహాయం అందించేందుకు సిద్దంగా ఉన్నామని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నగర యువజన విభాగం సీనియర్ నాయకుడు ముఠా జయసింహ, ఎస్ఆర్‌డీ సంస్థ ప్రతినిధులు శివ పార్వతి, శ్రీ భవానీ శంకర్ దేవాలయం చైర్మన్ ఆర్. శ్రీనివాస్, భోలక్‌పూర్ డివిజన్ ఇన్‌చార్జీ బింగి నవీన్‌కుమార్, డి. శివ ముదిరాజ్, బల్లా ప్రశాంత్, నర్సింగరావు, ముషీరాబాద్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు జావీద్, జర్నలిస్టులు ఎరం నర్సింగరావు, సీహెచ్. వీరారెడ్డి, బి. కనకరాజు, టి. వేణుగోపాల్, బి. సతీష్‌కుమార్, వీరన్న యాదవ్, ప్రేమ్ సాగర్, నర్సింహ, అఖిలేష్, టీకే చారీ, జహంగిర్, టి. గణేష్‌లతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఏపీలో నిలకడగా రోజువారి కరోనా కేసులు

అమరావతి, ఆగష్టు 10:ఏపీలో కరోనా కేసుల ఉధృతి కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో 1461 మందికి పాజిటివ్‌గా తేలింది. తాజాగా రాష్ట్రంలో 63,849 శాంపిల్స్‌ను పరీక్షించారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య 19,85,182కి చేరింది. ఇందులో 19,52,736 మంది కోలుకొని డిశ్చార్జ్ కాగా, 18,882 కేసులు యాక్టీవ్‌గా ఉన్నాయి. ఇక, రాష్ట్రంలో గడిచిన 24 గంటల్లో కరోనాతో 15 మంది మృతి చెందారు. దీంతో ఇప్పటి వరకు రాష్ట్రంలో నమోదైన మొత్తం కరోనా మరణాల సంఖ్య 13,564కి చేరింది. పశ్చిమ గోదావరిలో 235, కృష్ణా జిల్లాలో 210, చిత్తూరులో 195, గుంటూరులో 182, నెల్లూరులో 195, ప్రకాశం జిల్లాలో 112 కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో కరోనా నుంచి 2,113 మంది కోలుకున్నట్టుగా ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖ పేర్కొన్నది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 2,53,11,733 శాంపిల్స్‌ను పరీక్షించినట్టు ఏపీ ఆరోగ్యశాఖ తెలియజేసింది.

# కాణిపాకంలో ప్రమాణం చేసిన బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి



హైదరాబాద్ , ఆగష్టు 10:కడప జిల్లా ప్రొద్దుటూరులో టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటు అంశంపై వైసీపీ, బీజేపీ నేతలు ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. ఈ అంశం వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, బీజేపీ ఏపీ ప్రధాన కార్యదర్శి ఎస్.విష్ణువర్ధన్ రెడ్డి మధ్య వ్యక్తిగత ఆరోపణలకు దారితీసింది. విష్ణు పెద్ద దొంగ అని, పుట్టపర్తి ఆశ్రమంలో డబ్బు, బంగారం దోచేశారని రాచమల్లు ఆరోపించారు. దాంతో తాను కాణిపాకంలో సత్యప్రమాణం చేస్తానని, ఎమ్మెల్యే రాచమల్లు కూడా రావాలని విష్ణు సవాల్ చేశారు.అయితే ముందే చెప్పిన విధంగా బీజేపీ నేత విష్ణు మంగళవారం చిత్తూరు జిల్లా కాణిపాకం ఆలయానికి విచ్చేశారు. ఇచ్చిన మాట ప్రకారం కాణిపాకం వచ్చి దేవుని సన్నిధిలో సత్యప్రమాణం చేశానని విష్ణు తెలిపారు. తనపై నిరాధార ఆరోపణలు చేసిన వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి సత్య ప్రమాణం చేసేందుకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. అంటే ఆయన అవినీతి, హత్యా రాజకీయాలు చేస్తున్నట్టు అంగీకరించినట్టే కదా? అని విష్ణు వ్యాఖ్యానించారు.

## షూటింగ్ లో ప్రకాష్ రాజ్ కు గాయాలు

హైదరాబాద్ , ఆగష్టు 10:సినీ నటుడు ప్రకాష్ రాజ్ కు తీవ్ర గాయాలయ్యాయి. తమిళ స్టార్ హీరో ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న ఓ సినిమా షూటింగ్ లో ఆయన గాయపడ్డారు. చెన్నైలో జరుగుతున్న షూటింగ్ లో ప్రకాష్ రాజ్ కు గాయాలయ్యాయి. ఇదే విషయాన్ని ట్విట్టర్ వేదికగా తెలిపారు ప్రకాష్ రాజ్. కింద పడ్డాను ?.చిన్న ఫ్రాక్చర్ అయింది. హైదరాబాద్ కి వస్తున్నాను? నా స్నేహితుడు డాక్టర్ గురువారెడ్డి సర్జరీ చేస్తారు. అభిమానులు ఎవరు కూడా ఆందోళన చెందవద్దు అంటూ ట్వీట్ చేశారు.

కాగా ఇటీవల మా అసోసియేషన్ ఎన్నికల్లో పోటీ చేస్తానంటూ ప్రకాష్ రాజ్ అనౌన్స్ చేసినప్పటి నుంచి కూడా వార్తల్లో నిలుస్తున్నారు. ఇప్పటికే తన ప్యానల్ ని కూడా ప్రకటించారు ప్రకాష్ రాజ్.

# బైక్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు.. నలుగురికి తీవ్ర గాయాలు




జయశంకర్ భూపాలపల్లి, ఆగష్టు 10: ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీ కొట్టిన ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన కాటారం మండలంలోని బూడిదపల్లి సమీపంలో చోటు చేసుకుంది. మంచిర్యాల జిల్లా చెన్నూరు నుంచి అన్నారం బ్యారేజీ మీదుగా కాటారంకు వస్తున్న ఆర్టీసీ బస్సు బూడిదపల్లి సమీపంలో గంగారం వైపునకు వెళ్తున్న బైక్ ఎదురెదురుగా ఢీ కొన్నాయి.

బైక్ పై ప్రయాణిస్తున్న ధన్వాడ, గంగారం గ్రామాలకు చెందిన యువకులు కోరుకొప్పుల అంజి, ఇశ్రాయేల్, చికట్ల అంజి, ములుకల వరుణ్ తీవ్ర గాయాల పాలయ్యారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ధ్యానం నా జీవితాన్నే మార్చేసింది: సింధు



హైదరాబాద్ , ఆగష్టు 10: ఒలింపిక్స్‌లో రెండు మెడల్స్ గెలిచిన తొలి భారతీయ మహిళగా నిలిచిన బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు( ఖఎ ాతినిటష్త్రబీ ).. తన జీవితంలో ధ్యానం తీసుకొచ్చిన మార్పు గురించి చెప్పింది. తాను ధ్యానం చేయడం మొదలుపెట్టిన తర్వాతే తన జీవితం మొత్తం మారిపోయిందని తెలిపింది. ప్రతి ఒక్కరూ మెడిటేషన్ చేయాలని పిలుపునిచ్చింది. నగరంలోని హార్ట్‌ఫుల్‌నెస్ కేంద్రానికి వెళ్లిన ఆమె.. అక్కడ దాజీ ఆశీస్సులు తీసుకొని, ఆయనతో కలిసి ధ్యానం చేసింది. తన కుటుంబం మొత్తం ధ్యానం చేస్తుందని ఈ సందర్భంగా సింధు చెప్పింది.

వాళ్ల ద్వారానే నేను హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ కేంద్రానికి వచ్చాను. ఈ కన్హా శాంతివనమే కాదు ఏ హార్ట్‌ఫుల్‌నెస్ కేంద్రానికి వెళ్లినా నాకు ఎంతో సంతోషంగా ఉంటుంది. మెడిటేషన్ ప్రారంభించిన తర్వాతే నా జీవితం మారిపోయింది. మెడిటేషన్ గురించి విన్నప్పుడు చాలా మంది ఎన్నో ప్రశ్నలు లేవనెత్తుతారు. దీనిద్వారానే విజయం వస్తుందా అనీ అడుగుతారు. అయితే ధ్యానం ఓ మంత్రదండం కాదు. కానీ ఇది మీ మెదడు, హృదయంలో ఓ స్పష్టతనిస్తుంది. నా భావోద్వేగాలను సరిగా అర్థం చేసుకోవడంలో నాకు సాయపడింది. నేనేం చేయాలన్న స్పష్టత నాకు ఇచ్చింది. ఒత్తిడిలో ఉన్న సమయాల్లో ధ్యానం ఎంతగానో ఉపకరించింది అని సింధు చెప్పింది.

# వ్యాక్సిన్ల కొరత.. నిరాశగా వెనుదిరుగుతున్న ప్రజలు

హైదరాబాద్ , ఆగష్టు 10:తెలంగాణలో వ్యాక్సినేషన్ ప్రక్రియ నెమ్మదిగా కొనసాగుతోంది. ఇందుకు కారణం వ్యాక్సిన్ల కొరతే అన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ లో వ్యాక్సినేషన్ కేంద్రాల వద్ద నుంచి ప్రజలు వెనుదిరగడం ఈ పరిస్థితికి అద్దం పడుతోంది. కరోనా థర్డ్ వేవ్ వస్తుందన్న నేపథ్యంలో ప్రజలందరు అప్రమత్తమయి. వ్యాక్సినేష్ కోసం పరుగుతు పెడుతున్నారు. అయితే వ్యాక్సిన్ కేంద్రాల వద్ద మాత్రం వారికి సరిగిపడా టీకాలు అందుబాటులోకి రావడం లేదు. రెండో డోసు అయినా.. మొదటి డోసు అయినా ఏం తేడా లేదు.. తెల్లవారుజామునే వ్యాక్సిన్ కేంద్రాల దగ్గర క్యూలైన్లు కనిపిస్తున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు? అయితే, ఒక్కో పీహెచ్‌సీలో 100 మందికి మాత్రమే వ్యాక్సిన్ వేసుతున్నారు సిబ్బంది.. దీంతో.. మిగతావారు వెనుదిరిగి వెళ్లిపోవాల్సిన పరిస్థితి.. గతంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో రోజుకు లక్ష మందికి పైగా వ్యాక్సిన్ ఇచ్చినా.. ఇప్పుడు మాత్రం పరిస్థితి పూర్తిగా మారిపోయింది.. ఈ మూడు జిల్లాల పరిధిలో 484 వ్యాక్సినేషన్ కేంద్రాలు ఉన్నా.. వ్యాక్సిన్ల కొరత మాత్రం వెంటాడుతూనే ఉంది.. ఇక, నేటి నుంచి మరో 72 మొబైల్ వ్యాక్సిన్ కేంద్రాలు కూడా అందుబాటులోకి రానున్నాయని చెబుతున్నారు అధికారులు.

తెలంగాణలో ఆది నుంచి వ్యాక్సిన్ల కొరత ఉంది? వ్యాక్సిన్ల వ్యవహారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మాటల యుద్ధమే నడిచింది.. వ్యాక్సిన్ల కొరత కారణంగా చాలా రోజులు వ్యాక్సిన్ సెంటర్లను కూడా మూసివేసిన సందర్భాలు ఉన్నాయి.. మరోవైపు వ్యాక్సిన్లు ఎక్కువ సంఖ్యలో వృథా చేశారనే ఆరోపణలు కూడా వచ్చాయి.. ఆ తర్వాత కాస్త పరిస్థితి మారిపోయింది.. విస్తృతంగా వ్యాక్సిన్ పంపిణీ జరిగింది.. కొత్తగా తాత్కాలిక వ్యాక్సినేషన్ సెంటర్లను కూడా ఏర్పాటు చేసి.. వ్యాక్సిన్ వేశారు.. కానీ, ఇప్పుడు మళ్లీ టీకాల కొరత ఏర్పడింది.

## వైద్యులు బ్రెయిన్ ట్యూమర్ తొలగిస్తుంటే గాయత్రి మంత్రం జపించాడు!

జైపూర్, ఆగష్టు 10 : రోగి గాయత్రి మంత్రం జపిస్తుండగా వైద్యులు అరుదైన బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ నిర్వహించిన ఉదంతం జైపూర్‌లోని నారాయణ హాస్పిటల్‌లో వెలుగుచూసింది. సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ కేకే బన్సల్ నేతృత్వంలో న్యూరో సర్జరీ టీం విజయవంతంగా ఈ ఆపరేషన్ నిర్వహించింది. చురు ప్రాంతానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ హవల్దార్ రిధ్మల్ రామ్ (57) మాట్లాడలేక పోతుండటంతో పరీక్షించిన వైద్యులు బ్రెయిన్‌లోని స్పీచ్ ఏరియాలో లోగ్రేడ్ బ్రెయిన్ ట్యూమర్‌ను గుర్తించారు.సున్నితమైన ఈ ప్రాంతంలో ట్యూమర్‌ను తొలగించే క్రమంలో మాట్లాడే శక్తి కోల్పోవడంతో పాటు పక్షవాతం వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీంతో రోగిపై సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ కేకే బన్సల్ నేతృత్వంలోని న్యూరో సర్జన్ల బృందం విజయవంతంగా ఎవేక్ బ్రెయిన్ న్యూరో సర్జరీని నిర్వహించిందని నారాయణ హాస్పిటల్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ మాలా ఐరున్ తెలిపారు. ఇక సర్జరీ ముగిసేవరకూ స్పృహలో ఉన్న రిధ్మల్ రామ్ వైద్యులు ఆపరేషన్ నిర్వహిస్తుండగా గాయత్రి మంత్రం జపించారు.



# మానసిక ఆరోగ్య సేవల అందుబాటు పెంపు

న్యూఢిల్లీ, ఆగష్టు 10:డిప్రెషన్ సహా మానసిక రుగ్మతలను నయం చేయడానికి, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ 1982 నుంచి 'జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమాన్ని' (ఎన్ఎంహెచ్పీ) అమలు చేస్తోంది. దీని కింద, 'జాతీయ ఆరోగ్య మిషన్'లో (ఎన్హెచ్ఎం) భాగంగా, 'జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం' (డీఎంహెచ్పీ) అమలు కోసం రాష్ట్రాలు/యూటీల నుంచి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగా ఆయా ప్రభుత్వాలకు సాంకేతిక, ఆర్థిక సాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. డీఎంహెచ్పీ అమలు ఉద్దేశాలు:

–నివారణ, ప్రచారం, దీర్ఘకాలిక నిరంతర సంరక్షణ సహా మానసిక ఆరోగ్య సేవలను వివిధ స్థాయిల్లో, జిల్లా ఆరోగ్య సేవల పంపిణీ వ్యవస్థ వరకు అందించడం

–ఆత్మహత్యల నివారణ సేవలు, పని ప్రాంతపు ఒత్తిడి నిర్వహణ, జీవన నైపుణ్యాల శిక్షణ, పాఠశాలలు ఢ కళాశాలల్లో కౌన్సెలింగ్ అందించడం

–మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం మౌలిక సదుపాయాలు, ఉపకరణాలు, సిబ్బంది పరంగా సంస్థాగత సామర్థ్యాన్ని పెంచడం

–సామాజిక అవగాహన, మానసిక ఆరోగ్య సేవల పంపిణీలో భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం

– మానసిక ఆరోగ్య సేవల అందుబాటును మెరుగుపరిచే ఉద్దేశ్యంతో, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ స్థాయిలోనే మానసిక ఆరోగ్య సేవలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆయుష్మాన్ భారత్–హెచ్డబ్ల్యూసీ పథకం కింద, సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణలో భాగంగా, మానసిక ఆరోగ్య సంరక్షణ సేవలను సేవల ప్యాకేజీకి అనుసంధానించారు. మానసిక, నాడీ సంబంధ, సబ్స్టాన్స్ యూజ్ డిజార్డర్స్పై (ఎంఎన్ఎస్) కార్యాచరణ మార్గదర్శకాలు ఆరోగ్య కేంద్రాల (హెచ్డబ్ల్యూసీ) స్థాయిలో, ఆయుష్మాన్ భారత్ పరిధిలో విడుదలయ్యాయి. ఈ మార్గదర్శకాల ద్వారా, సమాజంలోని అన్ని వర్గాలకు ప్రాథమిక స్థాయిలో మానసిక ఆరోగ్య సేవలు అందుతున్నాయి.

# ఆగస్టు 30 నుంచి టీఎస్ ఎంసెట్ మొదటిదశ కౌన్సిలింగ్ ప్రారంభం



హైదరాబాద్ , ఆగష్టు 10: తెలంగాణ రాష్ట్ర ఇంజినీరింగ్, అగ్రికల్చర్, మెడికల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టీఎస్ ఎంసెట్) 2021 మొదటి దశ ప్రవేశాల కౌన్సిలెంగ్ ఆగష్టు 30వ తేదీ నుండి ప్రారంభం కానుంది. మంగళవారం సమావేశమైన టీఎస్ ఎంసెట్–2021 అడ్మిషన్స్ కమిటీ ఈ మేరకు షెడ్యూల్ను ప్రకటించింది. ఈ నెల 30 నుంచి సెప్టెంబరు 9 వరకు ధ్రువపత్రాల స్లాట్ బుకింగ్. సెప్టెంబరు 4 నుంచి 11 వరకు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన. సెప్టెంబరు 4 నుంచి 13 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు. సెప్టెంబరు 15న ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు. సీట్లు పొందిన అభ్యర్థులు సెప్టెంబ్ 15 నుంచి 20వ తేదీలోగా ట్యూషన్ ఫీజు చెల్లించి ఆన్లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సిందిగా సూచన. మరిన్ని వివరాలు సంబంధిత వెబ్సైట్ https://tseamcet.nic.in లో ఆగష్టు 28వ తేదీనుండి లభించనున్నట్లు అడ్మిషన్స్ కన్వీనర్ నవీన్ మిట్టల్ తెలిపారు.

# టీమిండియా హెడ్ కోచ్గా రాహుల్ ద్రవిడ్?



న్యూఢిల్లీ, ఆగష్టు 10:టీమిండియా హెడ్ కోచ్గా రవిశాస్త్రిని సాగనంపే దిశగా బీసీసీఐ పావులు కదుపుతోంది. ఆయన స్థానంలో హెడ్ కోచ్ బాధ్యతలను రాహుల్ ద్రవిడ్కు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. రవిశాస్త్రి కోచ్గా పనిచేస్తున్నప్పటి నుంచి భారత్ అనేక విదేశీ సిరీస్లలో విజయం సాధించింది. ఎంతో పురోగమించింది. అయితే ఐసీసీ టోర్నీల్లో సత్తా చాటలేకపోయింది. ఇక రవిశాస్త్రి పదవీ కాలం కూడా ముగియనుంది. దీంతో ఇకపై శాస్త్రికి కాకుండా కోచ్ పదవిని ద్రవిడ్కు అప్పగించాలని బీసీసీఐ ఆలోచిస్తున్నట్లు సమాచారం.మరోవైపు ద్రవిడ్ పర్యవేక్షణలో భారత అండర్ 19 క్రికెట్ జట్లు వరల్డ్ కప్ మ్యాచ్లలో సత్తా చాటాయి. 2016 జరిగిన అండర్ 19 వరల్డ్ కప్లో భారత జట్టు రన్నరప్గా నిలవగా, 2018లో ఏకంగా విజేతగా నిలిచింది. దీంతో ద్రవిడ్ 2019 జూలై 8 నుంచి బెంగళూరులోని ఎన్సీఏకు హెడ్గా కొనసాగుతున్నాడు. అయితే ఆ పదవీ కాలం రెండేళ్లు. ఇప్పటికే ముగిసింది. దీంతో ఎన్సీఏకు హెడ్ పదవి కోసం బీసీసీఐ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అయితే మరోమారు ఎన్సీఏ హెడ్గా పనిచేయాలంటే ద్రవిడ్ మళ్లీ దరఖాస్తు చేయాలి. కానీ అలా జరగకపోవచ్చని తెలుస్తోంది. కాగా ఇటీవల శ్రీలంక వెళ్లిన టీమిండియా జట్టుకు రాహుల్ ద్రవిడ్ కోచ్గా వ్యవహరించిన సంగతి తెలిసిందే.

# సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మిస్డ్ కాల్ సౌకర్యం




హైదరాబాద్ , ఆగష్టు 10:ప్రముఖ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు సర్ సోరాబ్జీ పోచఖనవాలా 140వ జయంతిని పురస్కరించుకొని ముంబైలోని తమ ప్రధాన కార్యాలయంలో బ్యాంక్ వారసత్వ భవనంలో వేడుకలు జరుపుకుంది.

ఈ కార్యక్రమంలో ఎమ్వి రావు ఎం డి, సిఇఒ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మరియు ఇతర ప్రముఖులు, వ్యవస్థాపకుల కుటుంబ సభ్యులు, బ్యాక్ సిబ్బంది మరియు వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు. రీవాంప్ ఇంటర్నెట్ బ్యాకింగ్, ప్రొడక్ట్, ఆధారిత ప్రీ– అప్రూవ్ క్రెడిట్ ఆఫర్లు, గోల్డ్ డిమాండ్ లోన్ కో లెండింగ్, హౌసింగ్లోన్, తదితర వివరాల కోసం 9223901111 గల నంబర్కు మిస్డ్ డయల్ సౌకర్యాన్ని ప్రారంభించినట్లు నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

# నా సంపదలో 70 శాతం ఫౌండేషన్కే : డాక్టర్ రవీంద్రనాథ్

హైదరాబాద్ , ఆగష్టు 10: గ్లోబల్ హెల్త్ ఫౌండేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు నగరంలోని ప్రసిద్ధ గ్లోబల్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ కె. రవీంద్రనాథ్ తెలిపారు. తన సంపదలో 70 శాతాన్ని ఫౌండేషన్కు ఖర్చు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఫౌండేషన్ ఏర్పాటుపై గ్లోబల్ ఆస్పత్రి వ్యవస్థాపకుడు ఈ మేరకు మంగళవారం ప్రకటన చేశారు. రూ.350 కోట్లతో ఫౌండేషన్ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పిన రవీంద్రనాథ్.. హెల్త్ వర్సిటీ, పరిశోధన హబ్ను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

గ్లోబల్ హాస్పిటల్స్. చైర్మన్గా డాక్టర్ కె.రవీంద్రనాథ్ 1999లో దీన్ని స్థాపించారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబైలో తన శాఖలను కలిగిఉంది. కిడ్నీలు, కాలేయం, గుండె, ఊపిరితిత్తులతో సహా ఇతర అవయవ మార్పిడిలో ఆస్పత్రి ప్రసిద్ధి. 2 వేల పడకల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ప్రతీ ఏడాది 3 లక్షల మంది ఔట్ పేషెంట్స్, 50 వేల మంది ఇన్ పేషెంట్స్గా చికిత్స పొందుతున్నారు. ప్రతీ ఏడాది 18 వేల సర్జరీలు నిర్వహిస్తుంటారు. భారతదేశ ప్రముఖ సర్జన్లలో ఒకరైన కె. రవీంద్రనాథ్ తిరుపతి శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజీ పూర్వవిద్యార్థి. గ్లాస్గో ఢ ఎడిన్బర్గ్ రాయల్ కాలేజీ ఆఫ్ సర్జన్స్కు చెందిన ఫెలో.

# మానవ మనుగడలో మొక్కలే కీలకం : అదనపు డీజీపీ అభిలాష బిస్త్

హైదరాబాద్ , ఆగష్టు 10:స్వచ్ఛమైన గాలినందించే నేటి మొక్కలే ఆరోగ్యాన్ని పంచే రేపటి చెట్లుగా మానవాళి మనుగడలో ప్రధాన భూమిక పోషిస్తాయని తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియన్స్ అదనపు డీజీపీ అభిలాష బిస్త్ పేర్కొన్నారు. మంగళవారం యూసుఫ్గూడ ప్రథమ పటాలంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజిపి డాక్టర్ జితేందర్, నగర పోలీసు సంయుక్త కమిషనర్ అవినాష్ మహంతిలతో కలిసి తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కలు ఆరోగ్య ప్రదాయినిగా–నే కాక అనారోగ్యాలను దూరం చేసే సంజీవనిగా కూడా ఉపయోగపడుతాయన్నారు.ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి వాటిని సంరక్షిం చడం ద్వారా ఆరోగ్యకర సమాజానికి బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ఎస్పీ బెటాలియన్స్ అధికారులు డీఐజీ ఎంఎస్ సిద్దిఖీ, ఓఎస్డీ పి.సత్యనారాయణ, సీఏఓ శ్రీరామ్, ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ అనూప్ కుమార్ మిశ్రా, అదనపు కమాండెంట్ కె.వీరయ్య, అసిస్టెంట్ కమాండెంట్స్ జి.రాజు, కె.సంపత్ కుమార్ రెడ్డి, జె.రాందాస్, బి.జవహర్లాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఒలింపిక్స్లో క్రికెట్.. గట్టిగా ప్రయత్నిస్తున్న ఐసీసీ

దుబాయ్, ఆగష్టు 10:: ఒలింపిక్స్లో ఎన్ని ఆటలు ఉన్నా.. క్రికెట్ ( అతీతిఇ నెవబి ) లేని లోటు ఇండియన్ ఫ్యాన్స్ను వేధిస్తూనే ఉంటుంది. ఈ మెగా ఈవెంట్లో జెంటిల్మెన్ గేమ్ ఉండాలని ప్రతి క్రికెట్ అభిమానీ కోరుకుంటున్నాడు. ఇప్పుడా దిశగా గట్టి ప్రయత్నాలు ప్రారంభించింది ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ). ఈ విషయాన్ని మంగళవారం ఐసీసీనే ధృవీకరించింది. అంతేకాదు ఒలింపిక్స్లో క్రికెట్ను చేర్చే దిశగా గట్టి ప్రయత్నాలు చేయడానికి ఓ వర్కింగ్ గ్రూపును కూడా ఏర్పాటు చేసింది. 2028 లాస్ఏంజిల్స్ ఒలింపిక్స్లో క్రికెట్ను చేర్చేలా ఇప్పటి నుంచే ఈ వర్కింగ్ గ్రూప్ ప్రయత్నాలు మొదలు పెట్టనుంది.ఒలింపిక్స్లో క్రికెట్ను చేర్చడంపై మంగళవారం ఐసీసీ చైర్మన్ గ్రెగ్ బార్క్లే స్పందించారు. ఐసీసీ తరఫున ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీకి, టోక్యోకు శుభాకాంక్షలు. క్లిష్ట సమయంలోనూ విజయవంతంగా గేమ్స్ను నిర్వహించారు. ఈ గేమ్స్లో క్రికెట్ ఉండాలని మేమూ ఆశిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్కు 100 కోట్ల మంది అభిమానులు ఉన్నారు. అందులో 90 శాతం మంది క్రికెట్ను ఒలింపిక్ క్రీడగా చూడాలనుకుంటున్నారు. దక్షిణాసియాలోనే 92 శాతం మంది క్రికెట్ ఫ్యాన్స్ ఉన్నారు. అమెరికాలో మరో 3 కోట్ల మంది ఉన్నారు. వీళ్లంతా ఒలింపిక్స్లో క్రికెట్ను చూడాలని ఆశపడుతున్నారు అని బార్క్లే అన్నారు.అయితే ఇది అంత సులువు కాదు. ఇప్పటికే చాలా గేమ్స్ ఆ దిశగా ప్రయత్నం చేస్తున్నాయి. కానీ క్రికెట్ కూడా ఒలింపిక్స్లో భాగం కావడానికి ఇదే సరైన సమయం అని మేము భావిస్తున్నాం అని బార్క్లే చెప్పారు. ఈ వర్కింగ్ గ్రూప్కు ఈసీబీ చైర్మన్ ఇయాన్ వాట్మోర్ చైర్మన్గా వ్యవహరించనున్నారు.

# ఫేస్బుక్ను దాటేసి మొదటిస్థానంలో నిలిచిన టిక్టాక్..

న్యూఢిల్లీ, ఆగష్టు 10:ాక్ అధిగమించింది. 2020లో ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ డౌన్లోడ్స్ అయిన యాప్గా టిక్టాక్ చరిత్ర సృష్టించింది. అప్పటి వరకు టాప్లో ఉన్న ఫేస్బుక్ను కిందికి నెట్టేసి.. టిక్టాక్ మొదటిస్థానంలో నిలిచింది.

సోషల్ మీడియా యాప్స్ డౌన్లోడ్స్ మీద చేపట్టిన గ్లోబల్ సర్వే ఫలితాలను తాజాగా వెల్లడించింది. ఈ సర్వేలో షాకింగ్ నిజాలు బయటపడ్డాయి. ఒక్కసారిగా టిక్టాక్ గ్లోబల్ మార్కెట్లో పుంజుకొని ఫేస్బుక్ మార్కెట్ను దెబ్బతీసింది.

2018 నుంచి చేపడుతున్న సర్వేలో టిక్టాక్ తన మార్కెట్ను గ్లోబల్గా విస్తరించుకుంటూ వెళ్లడం వల్ల.. డౌన్లోడ్స్లో టాప్ పొజిషన్లోకి వచ్చిందని జర్నల్ వెల్లడించింది.

2019లో ప్రపంచవ్యాప్తంగా యాప్స్ డౌన్లోడ్స్లో టిక్టాక్ 4వ స్థానంలో ఉండేది. నాలుగో స్థానం నుంచి 2020లో మొదటిస్థానానికి టిక్టాక్ ఎగబాకింది. 2019లో ఫేస్బుక్ రెండో స్థానంలో ఉండగా.. 2020లో కూడా అదే రెండో స్థానంతో ఫేస్బుక్ సరిపెట్టుకుంది. అయితే.. ఫేస్బుక్ మెసెంజర్ మాత్రం తన మొదటి స్థానం నుంచి ఐదో స్థానానికి పడిపోయింది.

చైనాకు చెందిన టిక్టాక్ యాప్.. చైనీస్ వర్షన్ ఆనీబీఎతిని కూడా చైనాలో రికార్డులు క్రియేట్ చేసింది. చైనాలో మొదటిస్థానాన్ని దక్కించుకుంది. యూఎస్లో కూడా 2020లో డౌన్లోడ్స్లో టిక్టాక్ టాప్లో నిలిచింది. ఫేస్బుక్ మెసెంజర్ను వెనక్కి నెట్టి.. మొదటి స్థానంలో నిలిచింది. 2020లో చైనా కాకుండా.. మిగితా ఏసియా దేశాల్లో డౌన్లోడ్స్లో టిక్టాక్ రెండో స్థానంలో ఉంది. ఫేస్బుక్ మొదటి స్థానంలో ఉంది.

అయితే.. ఇండియాలో గత సంవత్సరం జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య సుమారు చైనాకు చెందిన సుమారు 200 యాప్లను భారత ప్రభుత్వం నిషేధించింది. అందులో టిక్టాక్ కూడా ఉంది.

యూఎస్, యూకేలో టిక్టాక్ వ్యూయింగ్ టైమ్.. యూట్యూబ్ను మించిపోయిందట. దీన్ని బట్టి.. షార్ట్ వీడియోలకు ఎంత డిమాండ్ ఉందో.. అర్థం చేసుకోవచ్చు.. అని ఔతినెవతి ఒబతిజీ తరుపున ఈసర్వే నిర్వహించిన ఒజూజూ ఒనినితివ సంస్థ మార్కెటింగ్ మేనేజర్ చుజెన్ కిన్ స్పష్టం చేశారు.

2020లో 10 టాప్ డౌన్లోడ్స్ అయిన యాప్స్లో నాలుగు యాప్లు ఫేస్బుక్కు చెందినవి. అవి కూడా టాప్ 5 లోనే ఉండటం గమనార్హం. వాట్సప్, ఇన్స్టాగ్రామ్, ఫేస్బుక్, ఫేస్బుక్ మెసెంజర్.. ఈ నాలుగు యాప్స్.. ఫేస్బుక్ సంస్థకు చెందినవి.

# ప్రభుత్వ భూములకు హద్దులు ఏర్పాటు చేయాలి - జిల్లా అదనపు కలెక్టర్ సత్యప్రసాద్



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 10:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములకు హద్దులు ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ .సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో ఆయన అధికారులతో మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా ఎమ్మార్వో , భూసేకరణ అధికారులు ప్రభుత్వ భూములకు హద్దులు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అలాగే పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించి డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి రోడ్డుకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ లో భాగంగా నాటిన మొక్కలను సన్ రక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యామ్ సుందర్ రావు మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థం మాధవి,మున్సిపల్ అధికారులు సిబ్బందిపాల్గొన్నారు

# గీత కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట - ఎంపీపీ బైరగోని లావణ్య



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 10:(నేటినిజం ప్రతినిధి): గీత కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చందుర్తి ఎంపీపీ బైరగోని లావణ్య రమేష్ అన్నారు. చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సంపునూరు మల్లేశం గౌడ్ ఎన్నికకాగా సోమవారం స్థానిక గౌడ సంఘం వారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే కులవృత్తులకు మళ్లీ జీవం పోసయన్నారు. నేడు గీత కార్మికులకు 51 సంవత్సరాలకే పెన్షన్. తాటి చెట్టు పన్నులను రద్దు చేస్తూ, గీత కార్మికులు ప్రమాదం తో చనిపోయిన, వారికి 5 లక్షల ఎక్స్గ్రేషియా పెంచుతూ ప్రభుత్వం గీత కార్మికులను వారి వృత్తిని బలోపేతం చేసిందన్నారు. వేములవాడ శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ సహకారంతో ఈ ప్రాంతం అభివృద్ధి తో పాటు అన్ని వృత్తులు అభివృద్ధి చెందాలనే కెసిఆర్ గారి ఆలోచన తో టిఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. గీత కార్మికులు ఐక్యమత్యంతో వారి హక్కులకు సాధించుకోవాలని సూచించారు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సంపూ నూరి మల్లేశం గౌడ్ మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం తోనే గీత కార్మికులకు న్యాయం జరుగుతుందని అన్నారు. గీత కార్మికులకు సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానన్నారు.తన ఎన్నికను ఏకగ్రీవం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. పురిటి గడ్డ లో పుట్టిన నన్ను సన్మానించినందుకు గీత కార్మికులకు. గౌడ బంధువులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షులు పంపు నూరి పరుశరాములు గౌడ్. గౌడ సంఘం గ్రామ అధ్యక్షులు గుర్రం నర్సయ్యగౌడ్, ఉపాధ్యక్షులు దేవయ్యగౌడ్, నాయకులు బైరగోని రమేష్ గౌడ్, గుర్రం దేవయ్య గౌడ్, పెద్ద దేవయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ ఉద్యోగి ఉపాధ్యాయ చంద్రశేఖర్ ను సస్పెండ్ చేయాలి

–ఈవో ఇచ్చిన సర్క్యులర్ ను బేఖాతర్ చేసిన ఉద్యోగి

–పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 10:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో పనిచేసే అసిస్టెంట్ వీఆర్ఓ ఉపాధ్యాయుల చంద్రశేఖర్ పైన ఆలయ ఈవో పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం ఫిర్యాదు చేయడం జరిగింది నిన్న సోమవారం రోజున టిఆర్ఎస్ నాయకుడు జన్మదిన వేడుకల్లో పాల్గొని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు అతనికి సంబంధించిన సోషల్ మీడియా ట్విట్టర్ ప్రోగ్రాం లో అధికార పార్టీ సంబంధించిన వారితో ఫోటోలు పెట్టడం చేస్తున్నాడు కాబట్టి అతడి పైన చర్యలు తీసుకోవాలని కోరారు ఈనెల 6 తేదీన ఆలయ ఈవో ఒక సర్క్యులర్ జారీ చేసినప్పటికీ ఆలయ కు సంబంధించిన ఉద్యోగులు సోషల్ మీడియాలో రాజకీయం పార్టీకి సంబంధించిన వ్యక్తులతో పెట్టరాదని సర్క్యులర్ జారీ చేశారు దాన్ని పట్టించుకోకుండా నన్ను ఎవరు ఏమి చేస్తారని ధీమాతో ఆలయ ఉద్యోగి ఉపాధ్యాయుల చంద్రశేఖర్ సోషల్ మీడియా లో పోస్టు పెడుతున్నారు కాబట్టి దానికి సంబంధించిన స్క్రీన్ షాట్ లు ఈవోకు అందించి ఫిర్యాదు చేయడం జరిగింది. అతన్ని వెంటనే సస్పెండ్ చేయాలని పట్టణ కాంగ్రెస్ తరఫున కోరడం జరిగింది లేనిపక్షంలో హైకోర్టును ఆశ్రయిస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి. జిల్లా అధికార ప్రతినిధి నాగుల విష్ణు ప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి చిలక రమేష్, జిల్లా కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, చిలివేరి శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్ బీసీ సెల్ టౌన్ ప్రెసిడెంట్ నాగుల రాము గౌడ్, జిల్లా పట్టణ ఉపాధ్యక్షులు వస్తాదు కృష్ణ లింగంపల్లి కిరణ్, దాడి మల్లేశం, తదితరులు ఉన్నారు.

# వారెంట్ల అమలు ద్వారా పెండింగ్ కేసులను తగ్గించాలి

–కరీంనగర్ అడిషనల్ డిసిపి(పరిపాలన) జి చంద్రమోహన్

కరీంనగర్, ఆగష్టు 10:(నేటినిజం ప్రతినిధి): వివిధ కేసుల్లో పరారీలో ఉన్న నిందితులపై వారెంట్లను వేగవంతంగా అమలు చేయడం ద్వారా పెండింగ్ కేసుల సంఖ్య తగ్గుతుందని కరీంనగర్ పోలీస్ అడిషనల్ డిసిపి(పరిపాలన) జి చంద్రమోహన్ అన్నారు. పెండింగ్ వారెంట్ల అమలు కోసం ప్రత్యేక బృందాలు నూతనోత్సాహంతో పనిచేయాలని చెప్పారు.

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్స్టేషన్లలో సమన్లు,వారెంట్ల అమలు, మెడికల్ సర్టిఫికెట్ల విభాగాలకు చెందిన పోలీసు అధికారులతో మంగళవార నాడు కమిషనరేట్ కేంద్రంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి(పరిపాలన) జి చంద్రమోహన్ మాట్లాడుతూ సమన్లు, వారెంట్లను వేగవంతంగా అమలుచేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన కేసుల్లో మెడికల్ సర్టిఫికెట్లను సాధ్యమైనంత తొందరగా తీసుకరావాలని చెప్పారు. పెండింగ్ వారెంట్లు అమలుచేయడం ద్వారా దీర్ఘకాలం నుండి అపరిష్కృతంగా ఉన్న కేసులు పరిష్కారం అవుతాయని తెలిపారు. ప్రజలకు సేవలందించేందుకు లభించే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. న్యాయస్థానాలు, ప్రభుత్వ,ప్రైవేటు ఆసుపత్రులకు చెందిన వైద్యాధికారులతో సత్సంబంధాలను కొనసాగించాలని సూచించారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.